సాంఘిక, ఆర్థిక పోరాటాలు బొమ్మ బొరుసు వంటివి!



వాయిస్ ఆఫ్

# చార్వాక

సామాజిక చైతన్య మాసపత్రిక




సంపుటి : 19 సంచిక : 1 జనవరి – మార్చి 2024

## 32వ జాతీయ నాస్తికమేళా దృశ్యములు



మహిమల ప్రదర్శన : ప్రొఫెసర్ నరేంద్ర నాయక్, ఫిరా అధ్యక్షులు




'తత్త్వశాస్త్ర చరిత్ర–గతితార్కిక భౌతికవాదం' పుస్తక ఆవిష్కరణ

ప్రచురణ :
చార్వాకాశ్రమం

నిర్వహణ :
నాస్తిక సమాజం

# వాయిస్ ఆఫ్ చార్వాక

జనవరి-మార్చి
2024



గౌరవ సంపాదకులు : **డా॥ భాను ప్రసాద్**

ప్రధాన సంపాదకులు : **బి. సుధాకర్**

సహాయ సంపాదకులు :
జంజనం సత్యనారాయణ
సత్య నిర్ధారణ్
యం.యన్. బుద్ధ
వి.వి.డి.ఎస్. ప్రసాద్
లతీఫ్
కొర్రపాటి హనుమంతరావు
నండూరి నారాయణరావు
నాస్తిక్ శ్రీకాంత్



**రచనలు, అభిప్రాయాలు, విరాళాలు**
పంపవలసిన చిరునామా :
**బి. సుధాకర్**
చార్వాకాశ్రమం, నిడమర్రు (పోస్టు),
మంగళగిరి (మండలం)
గుంటూరు జిల్లా - 522 503.
సెల్ : 9290619550, 9440101814
ఎకౌంట్ నెం. 30174955006,
SBI Main Branch, Mangalagiri
IFSC Code : SBIN0001011
Google Pay, Phone Pay : 9290619550
voiceofcharwaka@gmail.com


శాస్త్రీయ స్పృహను
మానవ వాదాన్ని, పరిశీలనాతత్వాన్ని,
సంస్కరణను పెంపొందించటం
ప్రతి భారతీయ పౌరుని విధి,
భారత రాజ్యాంగం
ఆర్టికల్ 51(A)(H) రూల్ IV A.


**పత్రికలో ప్రచురించిన రచనలు ఆయా రచయితల అభిప్రాయాలు మాత్రమే. పత్రిక యాజమాన్యం వారి అభిప్రాయాలతో ఏకీభవించనవసరం లేదు.**


## ఈ సంచికలో...


| | | |
|---|---|---|
| 1. | ఆర్థిక పునాది-భావజాలం. ఏది నిర్ణయాత్మకం? | 3 |
| 2. | నాస్తిక చతురోక్తులు | 9 |
| 3. | మెదడులోని దేవుళ్ళు | 12 |
| 4. | క్రైస్తవ మతం మూలాలు | 15 |
| 5. | శ్రీ వేంకటేశ సుప్రభాత శృంగారం | 18 |
| 6. | అతి సూక్ష్మ ప్రపంచం | 23 |
| 7. | ఎన్నికల ఎత్తుగడే పౌరసత్వ చట్టం | 27 |
| 8. | 32వ జాతీయ నాస్తికమేళా రిపోర్టు | 29 |
| 9. | జాతకాలు అబద్ధాలు | 35 |
| 10. | ఆహారం - ఆరోగ్యం | 36 |
| 11. | గాంధీ - భగత్‌సింగ్ | 38 |
| 12. | హిందువులది రామభక్తి! | 40 |


మహిళలను ఒక భోగ వస్తువుగా మాత్రమే
చూసేవాడు ఇంకా
పూర్తిగా మనిషిగా కూడా మారనట్లే లెక్క
స్త్రీని దేవతగా చూడాలనే వాడు
నీ కళ్ళలో కారం కొడుతున్నాడు.
ఆమెను తల్లిగా, చెల్లిగా మాత్రమే చూడాలనే వాడు
సెంటిమెంట్‌తో చావగొట్టి తన పెత్తనాన్ని
మెత్తగా కాపాడుకుంటున్నాడు.
స్త్రీని ఒక పూర్ణ వ్యక్తిగా, స్వయం నిర్ణయాధికారం
ఉన్న వ్యక్తిగా చూడాలని తెలుసుకున్నవాడు
మాత్రమే ఆధునికుడుగా మారుతున్న పురుషుడు.
మార్చి 8 తల్లుల దినం కాదు.
స్త్రీల సమాన హక్కుల దినం.
సంపూర్ణ స్వయం నిర్ణయాధికారం కోసం
స్త్రీ పురుషులందరూ ఏకమై పోరాడవలసిన
సంకల్పాన్ని
మరొక్కసారి గుర్తు చేసుకునే దినం.

– జి. భార్గవ


నాస్తిక సాహిత్యం కోసం సంప్రదించండి :
చార్వాకాశ్రమం, నిడమర్రు (పోస్టు), మంగళగిరి, గుంటూరు జిల్లా - 522 502.
ఫోన్ : 91777 21588, https://charvaka.co.in/

# ఆర్థిక పునాది - భావజాలం. ఏది నిర్ణయాత్మకం?

భావాలు ఎక్కడి నుండి వస్తాయి? భావజాలానికి మూలాలు ఏవి? బుద్ధుడు లేకుండా బౌద్ధం, క్రీస్తు లేకుండా క్రైస్తవం, మహమ్మద్ లేకుండా ఇస్లాం వుంటుందా? 200 ఏళ్ల క్రితం మార్క్స్ పుట్టి వుండకపోతే మార్క్సిస్టు సిద్ధాంతం వుండేదా?

భావాలు ఆకాశం నుండి వూడిపడవు. మెదడులో ఊరి పైకి ఉబకవు. అవి దేవుడు లేదా లోకాతీతశక్తి యిచ్చిన వరం కాదు.

విశ్వంలో అత్యున్నతమైన, అతిసంక్లిష్టమైన పదార్థరూపం మెదడు. మనిషి పంచేంద్రియాల ద్వారా గ్రహిస్తాడు. మెదడుతో ఆలోచిస్తాడు. కార్యాచరణలో జ్ఞానాన్ని సంపాదిస్తాడు. జ్ఞానానికి తరగని గని ప్రకృతి, సమాజం.

సమాజ మనుగడకు మూలం ఉత్పత్తి. ఏ వస్తువునైనా ఉత్పత్తి చేయాలి అంటే తొలిచిరునామా ప్రకృతే. ప్రకృతి నుండి తమ జీవితావసరాలను సంపాదించుకొనే క్రమంలోనే మానవులు పరస్పర సంబంధాలు కలిగి వుంటారు. అవే 'ఉత్పత్తి సంబంధాలు' లేదా ఆర్థిక సంబంధాలు. మానవుల మధ్య రక్త సంబంధాలున్నాయి. కుల, మత, జాతి సంబంధాలున్నాయి. వీటన్నిటికంటే విస్తృతమైనవి, బలీయమైనవి, లోతైనవి ఆర్థిక సంబంధాలు. అవి కులాలు, మతాలు పుట్టక ముందే ఏర్పడినాయి.

మనిషికి కూడు, గుడ్డ, నీడ అన్నింటికన్నా ముఖ్యమే. అంతమాత్రాన అతనికి ఆర్థికం మినహా మరేమీ లేదా? అతడు కేవలం అన్నపానీయాలు సంపాదించుకొనే మరబొమ్మా? కాదు.

మనిషి మెషీన్ కాదు. అతడు ఆడతాడు. పాడతాడు, బొమ్మలు గీస్తాడు. కవితలు అల్లుతాడు. సిద్ధాంతాలు ప్రవచిస్తాడు. వేదాంతం బోధిస్తాడు. ముఖ్యంగా అతడు రాజకీయజీవి.

మానవుడు యంత్రాలలో యంత్రంగా లేడు. అతడు రోబో కాదు. అటు జీవితావసరాలను సృష్టించుకుంటాడు. ఇటు తాత్విక, రాజకీయ, న్యాయ, వైజ్ఞానిక, కళా సాహితీ రంగాలలో పాల్గొంటాడు. అతనికి భౌతిక జీవితం వుంది. సాంస్కృతిక జీవితం వుంది.

ఆర్థిక జీవనమా? సాంస్కృతిక చైతన్యమా? సామాజికాభివృద్ధిలో దేనిపాత్ర ఎంత? ఏది నిర్ణయాత్మకమైనది? ఏది పునాది? ఏది ఉపరితలం?

మానవుడు సంఘజీవి. అతడు సంఘం చెక్కిన శిల్పం. ఆదిమ సమ సమాజం మినహా మానవ సమాజం వర్గాలుగా విడిపోయింది. వర్గ సమాజంలోని మనిషి వర్గానికి అతీతుడు కాదు. అతని ప్రయోజనాలన్నీ వర్గ సంబంధాలతో ముడిపడి వుంటాయి. భూమి, గనులు, పరిశ్రమలు తదితర ఆర్థిక వనరులపై యాజమాన్యం ఎవరిదనేది వర్గ సంబంధాలలో అత్యంత కీలకప్రశ్న. అవి ప్రజలందరి యాజమాన్యంలో వుంటే ఉత్పత్తి ప్రజలందరికి పంపకమవుతుంది. కొందరి యాజమాన్యంలో వుంటే ఉత్పత్తి ఆ కొందరిదే అవుతుంది. ఈ వర్గ సంబంధాలే సామాజిక జీవన విధానాన్ని నిర్ణయిస్తాయి. ఆ జీవన విధానమే మనిషి ఆలోచనల్ని ప్రభావితం చేస్తాయి. బానిస యజమాని – బానిస, భూస్వామి – రైతు, పెట్టుబడిదారుడు – కార్మికుడు

జీవితం ఒకే రకంగా వుండదు. భావాలు ఒక్కటిగా వుండవు. వాటి మధ్య వైరుధ్యం వుంటుంది. ఘర్షణ వుంటుంది. ఈ ఘర్షణ నుండే సిద్ధాంతాలు పుట్టాయి.

ఏ సిద్ధాంతము లేదా భావజాలము తెగిన గాలిపటం కాదు. దానివెనుక ఓ వర్గం వుంటుంది. ఆ వర్గానికి ఒక ప్రయోజనం వుంటుంది. అది తెలుసుకోగల్గిననాడే ఏ గాలిపటం ఎవరు, ఎందుకు ఎగురవేశారో అర్థం జేసుకోగలం.

మానవ సమాజం. తొలిదశలో అతి సామాన్యమైన రాతిపనిముట్లు మాత్రమే వుండేవి. వ్యవసాయం తెలియదు. జంతువుల్ని వేటాడటం, విత్తనాలు, పండ్లు, దుంపలు ఏరుకు తినటం మాత్రమే వారికి తెలుసు. అరకొర ఆహారం. మిగులు లేదు. కలిసి పనిచేసేవారు. కలిగింది పంచుకొనేవారు. అలాంటి ఆదిమ సమసమాజంలో సొంత ఆస్తిలేదు. వర్గాలు లేవు. దోపిడీలేదు. అంతా సమానమే. చట్టం, ప్రభుత్వం, సైన్యం, పోలీసులు లేరు. రక్తసంబంధీకులు గణంగా, గణాలు తెగలుగా ఏర్పడి ప్రజాస్వామ్యయుతంగా ఒక కౌన్సల్‌ను ఎన్నుకొనేవారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం మానవ సమాజానికి పుట్టుకతో అబ్బిన సుగుణాలు. ఆ కాలంలో మతం లేదు. దేవుడు, దేవాలయాలు, పూజారులు లేరు. పరలోకం గురించి వారికి తెలియదు.

క్రీ.పూ. 10,000–8,000 కొత్తరాతియుగం – వ్యవసాయంతో మానవ సమాజం ఆహార ఉత్పత్తి దశలోకి ప్రవేశించింది. జీవనగమనం మారింది. కొత్త శ్రమ జీవితం కొత్త ఆలోచనల్ని పురిగొల్పింది.

విత్తనం నాటితే మొలకెత్తుతుంది. తల్లి బిడ్డకు జన్మనిస్తుంది. దీనిని నిబిడాశ్చర్యంతో పరికించారు కొత్త రాతియుగం మనుషులు. స్త్రీ, పురుష కలయిక ప్రకృతి సహజమని, అదే జన్మ రహస్యమని వారికి తెలియదు. స్త్రీని శక్తిస్వరూపిణిగా, పంటనిచ్చే భూమిని భూమాతగా భావించారు. అమ్మ దేవతలని కొలిచారు.

ప్రకృతి శక్తులంటే ఆరాధనేగాదు, భయంకూడా వుంది. వాన, వరద, ఉప్పెన, పిడుగు తదితర విపత్తులతో భయవిహ్వాలులయ్యారు. వాటిని ప్రసన్నం చేసుకోవటానికి మతంలేని ఆ కాలంలో మనిషి తన మనస్సులోని భావాలను అభివ్యక్తం చేయటానికి ప్రయత్నించాడు. అదే తంత్రవిద్య (Magic). ఉత్పత్తిశక్తులు హీనస్థాయిలో వున్నప్పుడు నిస్సహాయులైన మానవులు ప్రకృతిశక్తులను నియంత్రించాలనే కాంక్షనుండే ప్రాచీన తంత్రవిద్య లేదా ఆటవికమతం పుట్టింది. మేఘాన్ని వర్షించమని, అగ్నిని దహించమని, వేటజంతువు వధింపబడాలనే కోరికలను ధ్వని, నృత్యం అనుకరించి మంత్రతంత్రాలతో ఆజ్ఞాపిస్తారు. ఒక భ్రమను సృష్టించి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే ప్రక్రియ ఇది. ఆదిమ ఆటవిక వ్యవసాయ సమాజాలనుండి తంత్రశాస్త్రం ఉద్భవించింది. ఈనాటికీ ఆదివాసీ సంస్కృతిలో భాగంగా వుంది.

ప్రాచీన తంత్రవాదంలో సంతానోత్పత్తికి స్త్రీని, పంటలకు భూమిని, వర్షానికి మేఘాన్ని మూలంగా భావించారే గాని లోకాతీతశక్తులైన దేవుళ్లతో ముడిపెట్టలేదు. కార్యానికి గల కారణాన్ని ప్రకృతిలోనే వెతకడం వెనుక ఆదిమ భౌతికవాద ఛాయలున్నాయి. మతానికి ఇక్కడ చోటులేదు.

క్రీ.పూ. 3000–1200 కంచుయుగం – లోహపు పనిముట్లు వచ్చాయి. వ్యవసాయం, పశుపెంపకం అనూహ్యంగా అభివృద్ధి చెందాయి. ఆహారంలో మిగులు ఏర్పడింది. ఉత్పాదక

శక్తి పెరిగింది. మానవవనరుల కొరత ఏర్పడింది. యుద్ధాలలో ఓడిన వారిని బానిసలను చేశారు. శ్రమదోపిడిపై వర్గసమాజం తలెత్తింది. బానిస యజమానులు – బానిసలుగా మానవ సమాజం చీలింది. అదే సమయంలో పితృస్వామ్యం తలెత్తి, కుటుంబాలు, సొంత ఆస్తి వరుసగా వచ్చాయి. ఆస్తిగల వర్గాలకి ఆస్తిలేని వర్గాల నుండి రక్షణ కరువైంది. చట్టం, సైన్యం, రక్షకభటులు, కోర్టులు, జైళ్లు పుట్టుకొచ్చాయి. వాటి నిర్వహణకోసం రాజరిక ప్రభుత్వం ఏర్పడింది. దోచుకున్న సంపదలతో నగర రాజ్యాలు వెలిశాయి. ఆస్తిగల వర్గాలు శారీరక శ్రమ నుండి విముక్తి పొందాయి.

ప్రకృతి శక్తులపట్ల ఆరాధన, భయం నుండి పుట్టిన ప్రాచీన తంత్రవిద్య మతంగా మారింది. మతం అంటే లోకాతీతశక్తులపై విశ్వాసం. ఆ విశ్వాసమే దేవునిరూపం ధరించింది.

దేవుడు ఎలా వుంటాడు? ఎలాగైనా వుంటాడు. మామూలు మనిషిలా మాత్రం వుండడు. అసాధారణరూపం, అద్వితీయశక్తులు కలిగి వుంటాడు. చతుర్భుజుడు, షణ్ముఖుడు, త్రినేత్రుడు, అర్ధనారీశ్వరుడు, ఎన్నో రూపాలతో ఎందరో దేవుళ్లను మనుషులు తయారుచేశారు. ఆటవికులకు ప్రకృతిశక్తులే ఆరాధ్యదైవాలు. మతం ప్రవేశించాక వరుణదేవుడు, ఆకాశదేవుడు, అగ్నిదేవుడు, గాలిదేవుడు పుట్టుకొచ్చారు. వ్యవసాయ సమాజంలో సూర్యదేవుడు అందరివాడయ్యాడు.

నగర నాగరికతలో విజ్ఞానం వికసించిన కొలదీ రాయి, చెట్టు, పుట్టలో ఏవో శక్తులున్నాయనే కొత్తరాతియుగం నమ్మకాలు పాతబడ్డాయి. వాటిల్లోని విశేషం తరిగిపోసాగింది. తమ పరిసరాలకు దూరంగా అందని శిఖరాలపై దైవాన్ని ప్రతిష్టించారు. క్రమేపి భూమండలం దేవుళ్లకు ఇరుకై పోయింది. స్వర్గానికి, ఇతర లోకాలకి పారిపోయారు. లోకాతీతశక్తులుగా అవతరించారు. ఇక్కడ ఏం జరిగినా దానికి కారణం అక్కడి దేవుడే నన్నారు.

దేవుడి రూపం, వస్తు వాహనాలు మనకు కొత్తకాదు. దశావతారాలైనా, విశ్వరూప సందర్శనలోవైనా ఈ లోకంలోనివే. స్వర్గ, నరకాలు కూడ మన లోకానికి భిన్నంగా వుండవు. రూపంలోనే కాదు సామాజిక మార్పు ప్రభావం నుండి కూడ దేవుళ్లు తప్పించుకోలేరు. మాతృస్వామ్య వ్యవస్థలో అమ్మ దేవతలదే అగ్రపీఠం. పితృస్వామ్యంలో రెండోస్థానానికి నెట్టివేయ బడ్డారు.

రాత కనిపెట్టిన తర్వాత మతాన్ని ప్రజల్లోకి విస్తృతంగా వ్యాప్తి చేశారు. దేవుని లీలలుపై కథలు, కావ్యాలు, పురాణాలు, ఇతిహాసాలు అభూతకల్పనలతో ఇబ్బుముబ్బడిగా వచ్చాయి.

మరణానంతర జీవితం వుందనే అందమైన ఊహలు తీరని ఆశల్ని రేపాయి. శవాన్ని పాతిపెట్టి చుట్టూ తృణధాన్యాలు, ఆభరణాలు, పనిముట్లు వుంచి కర్మకాండలు జరిపారు. ఇదే తొలి మతాచారం. ఇదే మంత్రగాళ్ల, పూజారుల ప్రాబల్యాన్ని పెంచింది. కంచుయుగం నాటికి ఈజిప్టులో ఈ పిచ్చిముదిరి శవాలను 'మమ్మీ'లుగా భద్రపరిచారు. పిరమిడ్లు కట్టించారు. దేహానికి అతీతంగా 'ఆత్మ'ను ప్రతిష్టించారు. ఆత్మల పాపపుణ్యాలను లెక్కగట్టి స్వర్గ, నరకాలలో బెర్తులను రిజర్వు చేశారు. ఈ పరలోక వ్యవస్థల నిర్వహణకు ప్రత్యేక దేవుళ్లను సృష్టించారు. ఆత్మ, పరమాత్మల సంబంధంపై విశ్రాంతి వర్గాలు ఊకదంపుడు చర్చలు కొనసాగించాయి.

కంచుయుగంలో నగర రాజ్య కార్యకలాపాలన్నీ దేవాలయం చుట్టూ తిరిగేవి. రాజు పెద్దపూజారి. రాజకుటుంబీకులు, పూజారులదే దేవాలయంపై పెత్తనం. రాజును దైవాంశ సంభూతుడిగా, దేవుడి వారసుడిగా ప్రచారం చేశారు. కొందరు రాజులు తామే దేవుళ్లుగా, రాజాజ్ఞ దైవాజ్ఞగా ప్రకటించుకున్నారు. రాజ్యవ్యవస్థలో మతం ఒక భాగమైంది. రాజరికం, మతం పరస్పరం విడదీయరాని విధంగా పెనవేసుకుపోయాయి.

క్రీ.పూ. 1000-550 ఇనుముయుగం - ఇనుపకర్రు నాగలి, కొడవళ్లు, గొడ్డళ్లు వ్యవసాయంలో విప్లవాత్మక మార్పుల్ని ప్రవేశపెట్టాయి. అడవుల్ని నరికి భూమిని దున్నారు. కాలువలు త్రవ్వి నీటిని పారించి సాగులోకి తెచ్చారు. పెద్ద పెద్ద భూ ఎస్టేట్లు పాలకుల యాజమాన్యంలోకి పోయాయి. భూస్వామ్య వ్యవస్థకి బలమైన పునాది పడింది. కౌలు, వడ్డీ, పన్నుల రూపంలో రైతాంగాన్ని దోపిడీ చేసి అదనపు ఉత్పత్తి అపారంగా కాజేసి ఖజానాల్ని నింపారు. ఆర్థిక వనరులు కోసం పెద్ద రాజ్యాలు చిన్న రాజ్యాలను కబళించాయి. వ్యాపార వస్తువు మార్కెట్‌ను ఏలింది. డబ్బు సామాజిక జీవితాన్ని శాసించింది. రాజ్యం కేంద్రీకృతమై సామ్రాజ్యంగా ఎదుగుతున్న కాలమది.

సామ్రాజ్య స్థాపనకి, వ్యాపారాభివృద్ధికి కొన్ని ఆటంకాలు ఎదురైనాయి. రాజ్యం అనేక తెగలుగా విడిపోయివుంది. కేంద్రీకృత రాజ్య వవ్యస్థకి ఇది అడ్డంకి. చిన్న చిన్న రాజ్యాలు, సరిహద్దులు, విభిన్న సంప్రదాయాలు, ఆచారాలు, అలవాట్లు వ్యాపార విస్తరణకి అవరోధమవుతాయి. వీటిని అధిగమించాలంటే ఒక్కటే మార్గం, యుద్ధం. ప్రపంచాన్ని జయించాలి. అది మాత్రమే సరిపోదు. సాంస్కృతిక అడ్డుగోడల్ని బద్దలుగొట్టాలి. ఇందుకు ప్రత్యామ్నాయ భావజాలం కావాలి.

మతం మారనిది కాదు. అది సామాజిక, ఆర్థిక వ్యవస్థ అనే వేరుకు పుట్టిన కొమ్మ. ఇనుము యుగంలో నూతన పరిస్థితుల కనుగుణమైన నూతన మత సిద్ధాంతాలు బయలుదేరాయి. బహుదేవుళ్ల ఆరాధనస్థానే దేవుడు ఒక్కడే అనే మతాలు వచ్చాయి. అవే జుడాయిజం, క్రైస్తవం, ఇస్లాం. ఈ కొత్తమతాలతో తెగలను, చిన్న రాజ్యాలను ఏకం చేసే మార్గం దొరికింది.

యూదు తెగల్ని ఏకం చేసి, జెరూసలెం రాజధానిగా, వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చేయటానికి జుడాయిజం పాలకవర్గాలకి ఒక సాధనమైంది. క్రీ.పూ. 559లో ఇరాన్‌లో సైరస్‌రాజు ఉత్తరాది, దక్షిణాది తెగల్ని ఏకం చేసి, విశాల పర్షియన్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. వనరులను దోచి, రవాణా పెంచి అన్ని తెగలకు వ్యాపారాన్ని విస్తరించి అందర్నీ కొల్లగొట్టేందుకు సామ్రాజ్య సుస్థిరత, సాంస్కృతిక సమైక్యత కావాలి. అందుకోసం దేవుడొక్కడే అనే జురాష్ట్రియన్ మతానికి అధికార ముద్రవేశాడు.

క్రీ.పూ. 700-350 భారతదేశంలో గణవ్యవస్థ శిథిలమై రాజ్యవ్యవస్థ బలంగా రూపొందుతున్నకాలం. గంగా మైదాన తీరంలో ఇనుప పనిముట్లతో అడవులు నరికి వ్యవసాయాన్ని వృద్ధి చేశారు. వర్తకవర్గం గణనీయంగా పెరిగింది. ఈ రెండు వృత్తులే పన్నులకు ప్రధానమైనాయి. పన్నులే ఖజానాకి మూల ధనం. యజ్ఞయాగాదుల పేరుతో గోవులు, ఎద్దులు, గుర్రాలను వధించే వేద మతాచారం వ్యవసాయాభివృద్ధికి గొడ్డలిపెట్టు. దీనిని వ్యతిరేకించే

బౌద్ధమతం అహింసా సిద్ధాంతంతో వ్యవసాయ, వ్యాపార వర్గాలకు దగ్గరైంది. ఖజానాని నింపే ఈ వర్గాలకి రాజరికం తోడుగా నిలిచింది. బ్రాహ్మణ ఆధిపత్యాన్ని వ్యతిరేకించే క్షత్రియ రాజులు బౌద్ధాన్ని స్వీకరించారు.

క్రీ.పూ. 600 – చైనాలో కంచుయుగం నుండి ఇనుప యుగానికి, బానిసవ్యవస్థ నుండి ఫ్యూడల్ వ్యవస్థకి మారుతున్న కాలంలో ఉదయిస్తున్న కొత్త సమాజానికి ఒక కొత్త భావజాలం కావాలి. చైనా మధ్యతరగతి వర్గం అందుకు కావాల్సిన నేపథ్యాన్ని సమకూర్చింది. అలా పుట్టిందే కన్‌ఫ్యూషియనిజం. బలమైన కేంద్రీకృత రాజ్యవ్యవస్థే దీని లక్ష్యం.

క్రీ.శ. 4వ శతాబ్దం రోమన్ సామ్రాజ్యం పతనమైంది. బానిస వ్యవస్థ పునాది బద్దలైంది. కొత్తగా తలెత్తుతున్న ఫ్యూడల్ భూస్వామ్యవర్గానికి ఒక సిద్ధాంత ఆయుధం కావాలి. తొలుత పాలస్తీనా పేదలలో పుట్టి, తర్వాత గ్రీకు మతాలతో మమేకమై రూపాంతరం చెందిన క్రైస్తవ మతాన్ని పాలకవర్గం అక్కున చేర్చుకుంది. మధ్యయుగాలలో ఇరాక్, సిరియా, ఇజ్రాయేల్, పాలస్తీనా అరబ్ రాజ్యాలలో ఇస్లాం పుట్టింది. ఫ్యూడల్ పాలకవర్గంగా ఎదిగింది.

మతం అనేది ఒక రోగ లక్షణం. జబ్బు కాదు. జబ్బును కనుగొంటేనే పూర్తి స్వస్థత చేకూరుతుంది. మతాలకు మూలాలు దోపిడీ వర్గ వ్యవస్థలో వున్నాయి. మతం పోవాలి అంటే వర్గరహిత సమాజం రావాలి. శాస్త్రీయ దృక్పథం కావాలి.

1775లో జేమ్స్ వాట్ ఆవిరి యంత్రం కనిపెట్టాడు. గనులలో, పరిశ్రమలలో, నౌకాయానంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. 1789లో కార్ట్ రైట్ పవర్‌లూమ్‌ను డిజైన్ చేశాడు. 1830–40లో మోర్స్ టెలిగ్రాఫ్ కనిపెట్టాడు. కమ్యూనికేషన్స్, వస్త్ర రంగాలు నూతన శిఖరాలనందుకున్నాయి. రాజరిక ఫ్యూడల్ వ్యవస్థలో ఈ సైన్సు ఆవిష్కరణలు పెను ప్రకంపనాల్ని సృష్టించాయి. పెట్టుబడిదారులు కార్మికులు అనే కొత్తవర్గాలకు జన్మనిచ్చాయి. ఈ వర్గాలకి దశ, దిశ నిర్దేశించాల్సిన ఆవశ్యకత ముందుకొచ్చింది.

గనులలో, ఫ్యాక్టరీలలో పనిచేయటానికి పెట్టుబడిదారులకు మానవవనరులు కావాలి. ఇందుకు చిన్న చిన్న కార్ఖానాలు, గిడ్డంగులు మూతపడాలి. చేతివృత్తులవారు తమ సొంత పనిముట్లను క్రిందపడవేసి ఫ్యాక్టరీలలో జేరాలి. రైతులను భూముల నుండి వెళ్లగొట్టి చిన్న చిన్న కమతాలను కబ్జా చేయాలి. ఈ దురాగతాల్ని కప్పిపుచ్చే భావజాలం పెట్టుబడిదారి వర్గానికి అవసరమైంది. స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో కొత్త ఆర్థిక, రాజకీయ సిద్ధాంతాలు పుట్టాయి. రాజరికం పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అడ్డంకిగా వుంది. రాజు పోవాలి. ఇందుకు రాజు దైవాంశ సంభూతుడనే ఫ్యూడల్ భావన అడ్డొచ్చింది. భూస్వామ్యం, మతం కొత్త సమాజానికి గుదిబండగా తయారైంది. యూరప్‌లో పారిశ్రామిక విప్లవాలు వెల్లువెత్తాయి. ఫ్రాన్సులో రాజును ఉరేశారు. బ్రిటన్‌లో క్రైస్తవ మతాన్ని ప్రొటెస్టంట్ శాఖగా చీల్చారు. ఫ్యూడల్ వ్యవస్థ స్థానే పెట్టుబడిదారీ వ్యవస్థను నెలకొల్పారు.

ఆవిరియంత్రం కనిపెట్టినప్పుడు ఇది ఇంత కథ నడుపుతుందని ఎవరూ ఊహించలేదు. భవిష్యత్ మార్పుల కోసం కావాలని ఇది ఎవరో చేసిన ప్రయత్నంకాదు. మన మనస్సుకు, చైతన్యానికి వెలుపల జరిగిన భౌతిక పరిణామం ఇది.

శ్రమ దోపిడీయే పెట్టుబడిదారీ సమాజానికి పునాది. కార్మికులు ఎన్ని ఎక్కువ గంటలు పనిచేస్తే పెట్టుబడిదారుడికి అంత ఎక్కువ లాభం. ఈ దోపిడీని ప్రతిఘటించే కార్మికవర్గానికి ఒక భావజాలం కావాలి. అది చారిత్రక అవసరం. 'అదనపు విలువ సిద్ధాంతం'తో పెట్టుబడిదారీ దోపిడీని కారల్ మార్క్స్ బహిర్గతం చేశాడు. అదే మార్క్సిజం. పెట్టుబడిదారీ వ్యవస్థను కూలద్రోసి దాని శిధిలాలపై సోషలిస్టు, కమ్యూనిస్టు వ్యవస్థను నిర్మించేదే కార్మికవర్గ సిద్ధాంతం. మనుష్యుల మధ్య ఆర్థిక సంబంధాలే సమాజానికి పునాది. పునాది కనుగుణంగానే ఉపరితల నిర్మాణం వుంటుంది – మతం, సంస్కృతి, నాగరికత, విద్య, న్యాయం, తాత్విక రాజకీయ సిద్ధాంతాలన్నీ ఆ నిర్మాణంలో భాగాలే. ఇక్కడ పునాది, ఉపరితల సంబంధాల్ని యాంత్రికంగా అర్థం చేసుకోగూడదు. భావాల మధ్య సంఘర్షణ సామాజిక గతిని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

కారల్‌మార్క్స్ 'అర్థశాస్త్ర విమర్శన' గ్రంథానికి ముందుమాటలో ఈ పై సారాంశాన్ని ఇలా చెప్పాడు. "మనుష్యులు సామాజికంగా తమ జీవితావసరాలను ఉత్పత్తి చేసుకోవడంలో కొన్ని నిర్దిష్టమైన అనివార్యమైన సంబంధాలేర్పరుచుకొంటారు. అవి వారి ఇష్టాయిష్టాలనుబట్టి వుండవు. అవే ఉత్పత్తి సంబంధాలు. ఉత్పత్తిశక్తులు అభివృద్ధిని తెలియజేసే ఒక దశకు అనుగుణంగా ఉత్పత్తి సంబంధాలుంటాయి. ఈ ఉత్పత్తి సంబంధాల మొత్తం సమాజ ఆర్థిక నిర్మాణం అవుతుంది. అదే సమాజానికంతటికీ పునాది. దానిపై ఆధారపడే న్యాయ, రాజ్యాంగ ఉపనిర్మాణం ఏర్పడుతుంది. సామాజిక చైతన్యం కూడ దానికనుగుణంగానే రూపొందుతుంది. భౌతిక జీవితావసరాల ఉత్పత్తి సాంఘిక, రాజకీయ, సామాజిక కార్యకలాపాలను శాసిస్తుంది. మానవుల జీవితాన్ని నిర్ణయించేది వారి చైతన్యంకాదు, పైగా వారి సాంఘిక జీవితం వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది."

**– డా॥ ఆర్.కె**

---

## ది.10.03.2024న విజయవాడలో జరిగిన సాహిత్యలోహిత - బ్రౌన్ ల సంస్కరణ వివాహములో పాల్గొన్న నాస్తికసమాజం సభ్యులు



# నాస్తిక చతురోక్తులు

శివశేఖర్ కాలెపు

దేశంలో
మేధావులు సైంటిస్టులు
కరువైపోయారు
కారణం...
99% ఆస్తికులు వున్నారు కనుక!

టి.వి. ఛానళ్ళు
ఎవడో స్వామీజీని
ఒహో అంటాయి
ఎవడో బాబాని
అహో అంటాయి
ఎవడ్నో దేవుడని
ఒహో అహో అంటాయి
ప్రజా సమస్యల్ని ప్రసారం చేయకుండా
అభూత కల్పన దేవుళ్ళకి
తెగ ప్రచారం చేసేస్తుంటాయి!

ఈ దేవుడి రోజు వారి ఆదాయం యింత
ఆ దేవుడి ఆదాయం అంత అంటూ
స్క్రోలింగులు యిచ్చే టి.వి వాళ్ళు
సగటు మనిషి దారిద్ర్యపు రేఖకు
ఇంత దిగువున వున్నాడని
స్క్రోలింగులు ఎందుకు యివ్వరు?

వెంకన్న సాయి క్రీస్తు అల్లా
ప్రతి దేవుడికొక భక్తి ఛానల్
ఎవర్ని వుద్ధరించడానికి
భక్తిని మానవ శరీరాల్లోకి
ఇంజెక్ట్ చేసి, కళ్ళకు మైకపు పొరల్ని కప్పి
దేవుడి పేరిట ఆదాయ వనరుల్ని
సమకూర్చుకోవడానికే యివి!

ఏ మత విశ్వాసకులైనా
మరణిస్తే, వారి తాలూకూ దేవుళ్ళు
సంతాపం తెలపరు
సాటి మనిషి మాత్రమే స్పందిస్తాడు
స్వర్గలోకం పరలోకం పవిత్రలోకం
అనేవి లేనేలేవు
మరణానంతరం చైతన్యం
అంతమవుతుందేగానీ
వేరే లోకాలకు వెళ్ళిన దాఖలాలు లేవు!
దోపిడీలకు అనువైన ప్రదేశాలు
దేవాలయాలు
అందుకే...
హుండీలు నగలు తరచూ
చోరీలకు గురౌతుంటాయి
కారణం...
అక్కడ దేవుడు లేడని దొంగలకు
తెలుసు కనుక!

మనిషి
రాతి యుగంలోంచి
ఆధునిక యుగంలోకి వచ్చినా
ఇంకా ....
రాళ్ళకు మ్రొక్కుతూ
రాతి యుగంలోనే వుండిపోయాడు!
పేదరికం ఆకలి నిరుద్యోగం
హత్యలు అత్యాచారాలు ఆత్మహత్యలు
నిరంతరం క్రీడలుగా మారిపోయాయి
ఏ దేవుడూ...
ఆపే ప్రయత్నాలు చేయడు!
ఉడుత సాయం చేసిందని
దాని వీపుపై గీతలు గీసాడు రాముడు

మొత్తం వారధినే నిర్మించిన కోతులపై
ఎందుకు గీయలేదు
మర్చిపోయాడా?

మత గ్రంథాల్లో వున్న
శాంతి ప్రవచనాలు
వినడానికి తప్ప
ఆచరణకు పనికిరావు!

స్త్రీ దేవతా శిలలకు
ఎవడో వలువలు విప్పి
మరలా కట్టడం ఏమిటి?
ఆ దేవతామూర్తుల భర్తలు
ఏమీ అనుకోరా?
చలనం లేని రాతి బొమ్మలకు
శింగారాలు శృంగారాలు ఏల?

గోవుల మూత్రం
పవిత్రమంటున్నారు
ఔషధమంటున్నారు
రోగాలు పోతాయంటున్నారు
ఆంబోతు, ఎద్దు
ఆ కేటగిరీకి చెందినవే కదా
వాటి మూత్రం పవిత్రమైనది కాదా?

ఏ మతం అయితే
ఆచారాలు పేరిట మనిషి
స్వేచ్ఛను హరిస్తుందో
గొంతు నొక్కి వేస్తుందో
కాళ్ళకు సంకెళ్ళు వేస్తుందో
అది మతం కాదు
విషపు ఊబి!

కులాల పరిధిలో వున్న వాళ్ళు
మతాల మత్తులో తూలే వాళ్ళు
దైవం భ్రమల్లో భజన్లు చేసే వాళ్ళు
వీళ్ళ మెదళ్లలో
అజ్ఞానం తప్ప విజ్ఞానం వుండదు
వీళ్ళంతా సమాజానికి పెను ప్రమాదకారులు!
ఓ మతం వారు
కొన్ని సమాధులను
దర్గాలుగా భావించుకుంటారు
మరణించిన వారికి
ఏవేవో మహత్తులు వున్నాయనుకోవడం
ఒక భ్రాంతి ఒక పిచ్చి భ్రమ మాత్రమే!

ఈ ఆధునిక యుగంలో మనిషి యింకా
ఆస్తికత్వపు వూహలోనే విహరిస్తున్నాడు
వాస్తవిక నాస్తికత్వాన్ని
ఆమోదించలేక పోతున్నాడు
సూర్యుడు దేవుడు అని నమ్మేవాళ్ళు
కోకొల్లలుగా వున్నారు
సూర్యుడు కూడా ఒక నక్షత్రమే అని చెప్తే
నమ్మని వాళ్ళు కోట్లాది మంది వున్నారు
వాస్తవాలు వివరించే
నాస్తికత్వాన్ని నమ్మరు
అవాస్తవాలు చెప్పే
ఆస్తికత్వాన్ని నమ్ముతారు!

ఒకరేమో దేవుని ప్రవచనాలు అంటారు
మరొకరు దేవుని వాక్యములు అంటారు
ఇంకొకరు దేవుని సూక్తులు అంటారు
వినడానికి బాగానే వుంటాయి
కానీ! యివి మనిషి మెదడును ఎదగనివ్వవు!
ఈ సృష్టి అంతా దేవుని మహిమే అనే
భ్రమల్లో పడేస్తాయి

ఓ రామా
వాలిని ఎలా చంపాలో తెలియక
తికమక పడ్డావు
సుగ్రీవుడు పూలదండ వేసుకొస్తేగానీ
గుర్తించలేక పోయావు

రావణుడుని ఎలా చంపాలో తెలియక
కంగారు పడ్డావు
విభీషణుడు క్లూ యిస్తేగానీ చంపలేకపోయావు
అంచేత ఓ రామా... నీవు వీరుడివి శూరుడివి
దేవుడివా? అనే పొగడ్తలకు అర్హుడివేనా?

ప్రపంచంలో అత్యధిక
దేవుళ్ళు వున్న దేశం భారత్
అధిక దరిద్రులు వున్న
దేశం కూడా భారత్

ఈ దేశంలో దేవుళ్ళు తిష్టవేసినంత కాలం
దారిద్ర్యం వృద్ధిచెందుతూనే వుంటుంది

ఓ కృష్ణా!
జగన్నాటక సూత్రధారివి నేనే అంటావ్
పాచికల ఆటలో పాండవులు ఓడిపోతారని
నీకు ముందే తెల్సి వుండాలి కదా,
పాండవులకు యింటిమేషన్
ఎందుకు యివ్వలేదు
ద్రౌపదీ వస్త్రాపహరణం వరకూ
ఎందుకు తీసుకు వచ్చావ్ యీ నాటకాన్ని?

మతం మతం మధ్య
కుత్తుకలు తెగిన మానవ దేహాలు
ఏరులై పారుతున్న నెత్తుటి సెలయేర్లు
మతం చిచ్చు రగిల్చిన భయానక హింసలు
రాముడూ... ఏసూ... అల్లా... యేదున్నారయ్యా?

గుళ్ళో కొబ్బరికాయలు కొట్టడం అంటే,
కొబ్బరి నీళ్ళు త్రాగడానికి
చిప్పలు యింటికి తీసుకు వెళ్ళి
పచ్చడి చేసుకోవడానికి
అంతేగానీ,
కొబ్బరికాయకు దేవుడికి
ఎటువంటి అనుసంధానమూ లేదు
దేవుని అనుగ్రహమే ముఖ్యం అనుకుంటే,
ఏ పుచ్చకాయో గుమ్మడికాయో కొట్టొచ్చుగా?

చెవులు లేవు, భజంత్రీలు కావాలి
కండ్లు లేవు, విద్యుత్ దీపాలంకరణ కావాలి
నాసిక లేదు, ఏ వాసనా తెలీదు
నాలుక లేదు, ఏ రుచీ తెలీదు
రాళ్ళకు పేర్లు పెడితే దేవుళ్ళు ఔతారా
అజ్ఞానపు ఆలోచన్లు యింకెంత కాలం?

పిల్లలు ఆడుకునే
బొమ్మల పెళ్ళి
పెద్దలు చేస్తున్న
రాతి బొమ్మల పెళ్ళి
ఈ రెండూ ఒక్కటే!

ఈ సృష్టికి మూలకారకుడు
ఆ దేవుడే అయితే...
ప్రపంచానికి దేవుడు
ఒక్కడే వుండాలి కదా?
ఇందరు దేవుళ్ళు ఎందుకు?
ఇన్ని మతాలు ఎందుకు?
మతం మతం మధ్య రక్తపాతాలు
జరుగుతున్నా, ఆ ఒక్క దేవుడు
ఎక్కడ దాక్కున్నాడు?

దేవుళ్ళ హుండీలు
కోట్లతో నిండుతున్నా,
కడుపు నిండని పేదవాళ్ళు
ఈ దేశంలో కోట్ల మందే వున్నారు
బీదోళ్ళ క్షుద్బాధను తీర్చలేని
రాయికి మ్రొక్కనేల
కాసులు వేయనేల?

మనిషికి దేవుడితో పని లేదు
మనిషితోనే దేవుడికి పని అంతా
మనిషే లేకపోతే.. ...
గుళ్ళు చర్చ్‌లు మసీదులు
ఏవీ వుండేవి కావు!

# మెదడులోని దేవుళ్ళు

– డా॥ కొడవటిగంటి రోహిణీ ప్రసాద్

ఇతర ఆలోచనల్లాగే భక్తి పారవశ్యమూ, మతపరమైన ఆధ్యాత్మిక భావాలూ కూడా మెదడులోని కొన్ని భాగాలలో జరిగే చర్యల వల్లనే కలుగుతాయని పరిశోధనలు రుజువు చేస్తున్నాయి. అటువంటి నమ్మకాలేవీ లేనివారికి కూడా కృత్రిమంగా మెదడును అయస్కాంత క్షేత్రానికి గురిచేసి అవే భావనలు కలిగించేందుకు ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. అయితే వీటిద్వారా దేవుడున్నాడనో, లేడనో నిరూపించడం వీలవదు. ఎందుకంటే నమ్మకం ఉన్నవారు అది కూడా దేవుడి పనేననీ, మనసుకు దేవుడి గురించి గుర్తుచేసేందుకే అటువంటి ఏర్పాటు జరిగిందనీ వాదించే అవకాశం ఉంది. ఎటొచ్చీ ఇతరత్రా నమ్మకంలేని వారికి అప్పుడప్పుడూ దృశ్యాలూ, ధ్వనులూ స్పష్టంగా వినబడి, కనబడినప్పుడు వారు దాన్ని దేవుడున్నాడనడానికి 'ప్రత్యక్ష' సాక్ష్యంగా భావించి, ప్రభావితులు కావచ్చు. ఆ పరిస్థితుల్లో ఈ శాస్త్రీయ వివరణ ఉపయోగపడవచ్చు.

ఇవే కాదు. మెదడుకు సర్జరీ జరుగుతున్నప్పుడు పూర్తి మత్తుమందు ఇవ్వకుండా రోగులను డాక్టర్లు కొద్దిగా మాటల్లో పెడుతూ ఉంటారు. ఆ విధంగా తమ శస్త్రచికిత్సలో ఏ కారణం చేతైనా పొరపాటు జరిగి, రోగికి స్పృహ తప్పితే వెంటనే తెలుస్తుంది. ఇలా చేస్తూ, మెదడులోని కొన్ని భాగాలను స్పృశించినపుడు రోగులు తమకు తెలిసినవీ, ఎప్పుడో చిన్నప్పుడు జరిగినవీ సంగతులు గుర్తుకొచ్చాయని చెప్పడం జరిగింది. వీటిలో కొన్ని వాసనలూ, పాటల వరసలూ కూడా ఉండవచ్చు. అప్రయత్నంగా మనసు కలిగించే భావాలకు మరింత ఎక్కువ ప్రభావం ఉంటుంది కనుక ఇది తెలుసుకోవడం అవసరం. మెదడుకు సంబంధించినంత వరకూ ఈ రకరకాల ఆలోచలన్నీ మామూలుగా సాగే చిన్న చిన్న విద్యుత్ తరంగాలే.

మెదడులోని బీటా తరంగాలు సెకండుకు 13 నుంచి 30 దాకా ఉంటాయి. ఇవి చేతనావస్థనూ, కేంద్రీకృత తార్కిక ఆలోచనాధోరణినీ, బహిర్వర్తన (ఎక్స్ట్రోవర్ట్) వైఖరినీ సూచిస్తాయి. సెకండుకు 7 నుంచి 13 దాకా ఉండే ఆల్ఫా తరంగాలు విశ్రాంతినీ, నిర్లిప్తస్థితినీ, ధ్యానాన్నీ, హిప్నోసిస్‌నూ సూచిస్తాయి. సెకండుకు 4 నుంచి 7 దాకా ఉండే తీటా తరంగాలు పగటికలలు కనడాన్నీ, సృజనాత్మకతనూ, ధ్యానాన్నీ, అతీంద్రియ సంఘటనలనూ, శరీరం నుంచి వేరయిన భావననూ, ఆధ్యాత్మిక భావాలనీ కలిగిస్తాయి. మొదటిరకం ఎక్కువ తీవ్రతనూ, చివరివి తక్కువ తీవ్రతనూ కలిగి ఉంటాయి. తక్కినవి మధ్యస్తం. ధ్యానంలో ఉన్నప్పుడు ఇవన్నీ మారుతూంటాయి. ఈ మార్పులు స్థల, ప్రాంతాలతో సంబంధం లేకుండా అందరికీ (స్త్రీ, పురుషులూ, పిల్లలూ, వృద్ధులూ) వర్తిస్తాయి.

బౌద్ధ భిక్షువులు ధ్యానంలో ఉన్నప్పుడు వారిపై జరిపిన పరీక్షల్లో మెదడు ముందు భాగంలో ఆలోచనలని కేంద్రీకృతం చేసే ప్రక్రియలు వేగవంతం అయ్యాయనీ, పరిసరాలనూ, స్థల స్వరూపాన్నీ

గుర్తించే మెదడు పైభాగం మందగిస్తుందనీ తెలిసింది. క్రైస్తవ ఉపాసకులు మంత్రోచ్చారణ చేస్తున్నప్పుడు కూడా ఇదే జరిగింది. ధ్యానం చేసిన కొందరికి గుండెజబ్బుల నుంచి కొంత ఉపశమనం కూడా లభించింది. కానీ ఆధ్యాత్మిక భావాల్లో కొన్ని దేవుడికి దూరమైపోతున్నట్టూ, అశాంతికి గురి అవుతున్నట్టూ కూడా అనిపిస్తాయి. పరిశోధనల్లో వీటన్నిటినీ పరిగణిస్తున్నారు. ప్రపంచంలో ఇంతమంది వేరు వేరు రకాల మనుషులకు దేవుడిమీద నమ్మకం ఒకే పద్ధతిలో కలగడానికి కారణం ఏమిటి? ఇందులో వివిధ సంస్కృతుల మధ్య ఎక్కువ తేడాలు కూడా కనిపించవు. అంటే ఇటువంటి భావాలకు సులభంగా గురి అయే లక్షణాలు మెదడుకు ఉన్నట్టేనని తేలుతోంది. ఇందుకు భౌతిక కారణాలేవైనా ఉన్నాయా అని పరిశోధనలు జరుగుతున్నాయి. కొన్ని ప్రయోగాల్లో మతపరమైన భావాలవల్ల లాభం పొందినట్టు అనిపించడానికి కారణం ధ్యానం వగైరాల వల్ల మెదడులో కణతల వద్ద ఉండే భాగాలు ప్రేరితం కావడమేనని తెలుస్తోంది.

వీటి ముఖ్య ఉద్దేశమల్లా ఒకటే. కేవలం మెదడులో అకస్మాత్తుగా మెదిలే కొన్ని భావాలను బలహీనతలుగా చేసుకుని కొందరు మతం పేరుతో మోసాలు చెయ్యడం జరుగుతోంది. కనుక మెదడులో ఇటువంటి అయోమయం అప్పుడప్పుడూ ఎందుకు కలుగుతుందో సామాన్య ప్రజలకు తెలియజెయ్యడం అవసరం. ముఖ్యంగా మన దేశంలో చేతబడులూ, మంత్రగాళ్ళ మీద నమ్మకాలు ఎక్కువ. కనీసం చదువుకున్నవారైనా నిజానిజాల గురించి ఆలోచించగలిగితే కొంత ప్రగతిని సాధించినట్టే. మెదడులో ఏదో కారణం చేత కలిగిన భౌతికమైన అలజడికీ, దేవుడున్నాడన్న నమ్మకానికీ సంబంధమేమీ లేదని తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఈ పరిశోధనవల్ల కొన్ని మానసిక రుగ్మతలకు నివారణ కూడా కలగవచ్చు. ఇది మందులు లేకుండా మెదడుకు తగిన ప్రేరణలిచ్చి సాధించవచ్చు. గత వ్యాసంలో చెప్పినట్టుగా ఎపిలెప్సి వల్లనూ, మాదక ద్రవ్యాలవల్లనూ కూడా కొన్ని ఆధ్యాత్మిక భావనలు కలుగుతాయి.

కొన్ని పరిశోధనల్లో 'ప్రేతాత్మలు' ఆవేశించినవారి మెదడునూ, వారి నుంచి 'సందేశాలు' అందుకుంటున్న ఇతరుల మెదడునూ పోల్చి చూస్తున్నారు. చైతన్యం అనేది మనిషి చచ్చిపోయినప్పుడు మెదడుతో బాటు అంతమౌతుందా, లేక శరీరానికి బయట 'కొనసాగుతుందా' అనేదాన్ని గురించి కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. కొనసాగదంటే మనిషికన్నా బలీయమైన అతీతశక్తి ఏదో ఉందనేవారికి నచ్చదు. దేవుడి గురించి బలంగా కలిగిన భావాలన్నీ కూడా మెదడులోని నరాల విన్యాసాల వల్లనే అంటే వారు ఒప్పుకోరు. శాస్త్రవేత్తలు కొందరు మాత్రం దైవాన్ని గురించి ఊహలన్నీ మెదడులో కలిగే భ్రమలేననీ, దేవుడనేవాడెవడూ లేడనీ అంటారు. మతాన్ని నమ్మేవారిలో కూడా బౌద్ధులు ధ్యానమే ముఖ్యంగా భావిస్తారు. దేవుడున్నాడా లేడా అనేది వారికి ప్రధానం కాదు.

మెదడు అనేది కొన్ని అణువుల, కణాల సమ్మేళనం మాత్రమేనా? మతం అనే 'సంగీతాన్ని' మోగించే వాయిద్యమే మెదడు కాదా? వాయిద్యానికీ సంగీతానికీ ఉన్న సంబంధమే మెదడుకూ, ఆలోచలనలకూ ఉందనేవారూ ఉన్నారు. చూస్తున్న దృశ్యాలనూ, పొందుతున్న ఇతర అనుభవాలనూ

మెదడు ఎలా పసిగడుతుందో దేవుడి ఉనికిని కూడా అలాగే గుర్తిస్తోందేమో? అన్నీ రసాయనిక మార్పులే అయినప్పుడు దేవుడి గురించిన భావాలు మాత్రం అబద్ధమెందుకు కావాలి? అదీ యథార్థమేనేమో?

అసలు యథార్థత అంటే ఏమిటి? మెదడులోనూ, మనసులోనూ కలిగే భావాలన్నీ యథార్థమైనవా? పరిణామవాదాన్ని బట్టి చూస్తే నిజమైన యథార్థమేదో తెలుసుకోవడం మెదడు యొక్క బాధ్యత కాదు. ప్రపంచంలో ప్రాణి యొక్క భద్రతనూ, మనుగడనూ కాపాడడమే దాని పని. తన ఉనికిని గుర్తించుకుని, స్వపర భేదాన్ని అర్థం చేసుకుంటూ, ఉన్న కాసిని ఇంద్రియాల సహాయంతో హానికి గురికాకుండా, ఆహారాన్నీ, ప్రమాదాలనూ కనిపెడుతూ, సంతానోత్పత్తిని సాధిస్తూ, వీలున్నంతకాలం ప్రాణాన్ని నిలుపుకోవడమే దాని విధి. ఇలా అంటే మనిషిని జంతువుల స్థాయికి దిగజార్చినట్టు అనిపిస్తుందేమో కాని ప్రాణికోటిలోని వివిధ జంతువుల శరీర నిర్మాణంలోని తేడాలను బట్టి చూస్తే మనిషికి మరీ గొప్ప ప్రత్యేకత ఏదీ లేదు. అందువల్ల కేవలం ఆలోచనలనూ, ఊహలనూ ఆధారం చేసుకుని "అన్నీ" తెలుసుననుకోవడం సరైనపని కాకపోవచ్చు.

---

## సైన్స్‌తోనే సంతోషం! – మా.శ్రీ.రాజు

దేవుడు వున్నాడా?
ఉన్నాడనే అంటారు చాలామంది.
చూసినవాడు లేడు!
చూపించేవాడు లేడు!!
ఉంటేగా చూడటానికి!
చూపించటానికి!!
లేనివాడ్ని ఎలా చూస్తారు?
ఎక్కడ్నుంచి చూస్తారు?
లేదని ఎవడైనా అంటే –
చెడ్డతనం అంటారు!
చెడ్డవాడు అంటారు!!
లేనివాడ్ని లేడంటే –
చెడ్డతనం ఎలా అవుతుంది?
చెడ్డవాడు ఎలా అవుతాడు?
లేనివాడ్ని –
ఉన్నాడంటే మంచి అవుతుందా?
అబద్ధాలు చెబితే –
మంచివాడు అవుతాడా?
దోచుకోవటానికి –
దేవుడ్ని సృష్టించి,
భయపెట్టి దోచుకొని –
బాగుపడుతున్నారు కొందరు!
దోపిడికి బలవుతున్నారు –
భయంతో అందరు!
దోపిడి పోవాలంటే –
హేతువాదం కావాలి!
దుర్మార్గం ఆగాలంటే –
హేతువాదులు అవ్వాలి!
నీ శక్తిని గ్రహించాలంటే –
నాస్తికత్వం కావాలి!
నీవు నిలుదొక్కుకోవాలంటే –
నాస్తికుడు అవ్వాలి!
సత్యం గ్రహించాలంటే –
సైన్స్ తెలుసుకోవాలి!
నిజమైన సంతోషం కావాలనుకుంటే –
సైన్స్‌తోనే పొందాలి!

# క్రైస్తవ మతం మూలాలు (The roots of Christianity)

– డా॥ ఆర్.కె

(గత సంచిక తరువాయి)

## క్రైస్తవ మతం చారిత్రక నేపథ్యం

క్రీ.పూ. 539లో పర్షియన్లు బాబిలోనియన్లను ఓడించారు. ఆనాటి అగ్రరాజ్యాల ఎత్తుగడలలో భాగంగా బందీలుగా వున్న యూదు ధనిక వర్గాలకి జూడియాను తిరిగి అప్పగించారు. జెరూసలెం రెండవ దేవాలయ నిర్మాణానికి అనుమతించారు. అయితే జూడియాకి సొంత రాజు వుండడు. పర్షియా నియమించే గవర్నరు వుంటాడు. దేవాలయంలో బలమైన పూజారివర్గం నెలకొంది. పర్షియన్ పాలన 2 శతాబ్దాలు సాగింది.

క్రీ.పూ. 332లో అలెగ్జాండర్ తన జైత్రయాత్రలో భాగంగా పర్షియాను జయించాడు. అతడి మరణానంతరం సేనాధిపతులు రాజ్యాన్ని నాలుగు ముక్కలుగా పంచుకొన్నారు. జూడియా టోలమీల ఏలుబడిలోని ఈజిప్టు అధీనంలోకెళ్లింది. వారు యూదుమత సంప్రదాయాలను గౌరవించారు. అయితే మూసిడోనియాకి చెందిన సెల్యూసిడ్ గ్రీకు చక్రవర్తులు ఇరాన్, ఇరాక్, సిరియా, లెబనాన్‌ల నుండి ఆఫ్ఘనిస్తాన్ వరకు మహాసామ్రాజ్యాన్ని స్థాపించడమేగాక, క్రీ.పూ. 190లో ఈజిప్టు టోలమీలను ఓడించి జూడియాను స్వాధీనం చేసుకున్నారు.

### మక్కాబియన్‌ల తిరుగుబాటు

ఇంతవరకు విదేశీపాలనలో కూడ యూదులు తమ మత సంస్కృతి, సంప్రదాయాల్ని, దేవాలయాల్ని కాపాడుకొన్నారు. గ్రీకుల రాకతో పరిస్థితి తారుమారైంది.

గ్రీకు పాలనలో జూడియా పట్టణాలలోని రాజవంశీకులు, మతాధిపతులు ఆర్థికంగా బాగా పుంజుకున్నారు. గ్రీకు సంస్కృతి ప్రభావం కూడ వారిపై పడింది. గ్రామీణ రైతాంగం మాత్రం ఇంటా, బయటా పాలకవర్గాల దోపిడీతో దివాళా ఎత్తింది.

గ్రీకు చక్రవర్తి యూంటియోకస్ అధికారం చేపట్టిన తర్వాత అంతా గ్రీకు మయమనే నినాదం వికృత రూపం దాల్చింది. యూదు సంస్కృతిని రూపుమాపి, గ్రీకు సంస్కృతిని రుద్దే ప్రయత్నం జరిగింది. జెరూసలెం దేవాలయంలో జోక్యం ఎక్కువైంది. ఎవరు ఎక్కువ లంచం యిస్తే వారిని ప్రధాన పూజారిగా నియమించసాగారు. దేవాలయం వెలుపల గ్రీకు ఆటలకోసం జిమ్నాసియంను నిర్మించారు. అక్కడ గ్రీకు సంప్రదాయం ప్రకారం దిగంబరంగా ఆడాలి. అది యూదు సూత్రాలకు వ్యతిరేకం. ప్రతి ఒక్కరూ ఒక్కసారైనా జిమ్నాసియంలో దిగంబరంగా ఆడి తీరాలని రూలుపెట్టారు. యూదులపై గ్రీకుల ఆధిపత్యం చాటటానికి ఈ పనిచేశారు.

గ్రీకులు విగ్రహారాధకులు. జెరూసలెం దేవాలయంలోని బలిపీఠంపై జియాస్ గ్రీకు దేవుడి విగ్రహాన్ని ప్రతిష్టించారు. సుంతీ చేయించు కోవటాన్ని, సబ్బాత్‌ను నిషేధించారు. టోరా పవిత్రగ్రంథాల్ని చించివేశారు. గ్రీకు దేవుళ్లని ఆరాధించాలన్నారు. ఈ ఆజ్ఞలను ధిక్కరించిన యూదులకు మరణశిక్ష విధించారు.

గ్రీకు చక్రవర్తుల దోపిడి, సాంస్కృతిక అణచివేతలకు వ్యతిరేకంగా యూదులలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. చిలికి చిలికి గాలివానై ఒక సంఘటన తిరుగుబాటుకు దారితీసింది.

గ్రీకు చక్రవర్తి ఆజ్ఞలను అమలుచేయటంకోసం అతని అధికారులు మోదిన్ పట్టణానికి వెళ్లారు. అక్కడ వృద్ధుడైన స్థానిక యూదు పూజారి మట్టాతియాస్‌ను కలిశారు. గ్రీకు దేవుడికి ఒక పందిని బలిచ్చి ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని ఋజువుచేసుకోమన్నారు. అతడు నిరాకరించాడు. ఆ పని చేయటానికి మరో యూదు ముందుకు రాగా అతనిని, ఆ ప్రభుత్వ అధికారిని మట్టాతియాస్ చంపేశాడు. గ్రీకు దేవుడి విగ్రహాన్ని ముక్కలు చేశాడు.

మట్టాతియాస్, అతని ఐదుగురు కొడుకులు గ్రీకు ప్రభుత్వంపై తిరుగుబాటుకు పిలుపునిచ్చారు. ఎందరో వారిని అనుసరించారు. యువకుల్ని రిక్రూట్ చేసుకొని గెరిల్లా యుద్ధాన్ని ప్రారంభించారు. జూడియా ఉత్తరప్రాంత గ్రామాల్ని విముక్తి చేశారు. మట్టాతియాస్ మరణించాక అతని కొడుకు జూడాస్ సైనిక నాయకత్వం వహించాడు. 'మక్కాబీ'గా అంటే 'సుత్తి'గా ప్రజాదరణ పొందాడు. జాతివిముక్తికోసం, సాంస్కృతిక విలువల పరిరక్షణకోసం విదేశీ దురాక్రమణ, దోపిడీలకు వ్యతిరేకంగా జూడియా యువత వీరోచితంగా పోరాడింది. గెరిల్లా ఎత్తుగడలతో ఒక పెద్ద సామ్రాజ్యసేనను మట్టికరిపించింది. కంగుతిన్న గ్రీకు చక్రవర్తి యాంటియోకస్ అనుభవజ్ఞుడైన జనరల్ లిసియాస్‌ను 60 వేల సైన్యం, 5 వేల అశ్విక దళంతో యుద్ధరంగానికి పంపాడు. జూడియన్లకి తమ మాతృభూమి అణువణువూ చిరపరిచితమైనదే. శత్రుసైన్యానికి ప్రతిదీ కొత్తే. వందల సంఖ్యలో మాత్రమే వున్న గెరిల్లా సైన్యానికి ప్రజల అండదండలున్నాయి. అత్యంత ధైర్య సాహసాలతో ప్రాణాలొడ్డి పోరాడారు. జెరూసలంలోకి ప్రవేశించి పవిత్ర దేవాలయాన్ని స్వాధీనం చేసుకున్నారు. దేవాలయాన్ని దోచుకోవటమేగాక, ధ్వంసం చేసిన గ్రీకు పాలకులపై జూడియన్లు మండిపడ్డారు. ఆలయాన్ని శుద్ధిచేసి, దేవుడికి పునరంకితంచేసి, ఎనిమిదిరోజులపాటు దీపారాధన (హనుక్కా) చేశారు. అది డిసెంబరు 25, క్రీ.పూ. 165.

చక్రవర్తి యాంటియోక్లిస్ చనిపోయాడు. లైసియన్ రాజయ్యాడు. క్రీ.పూ. 163లో లక్షా 25 వేల సైన్యం, 32 యుద్ధ ఏనుగులతో జెరూసలెంపై దాడి చేశాడు. జెరూసలెంను దిగ్బంధం చేసి జూడియన్లని ఆకలితో మాడ్చి చంపాలని ప్లాను చేశాడు. భీకరయుద్ధం జరిగింది. జూడాస్ రెండవ సోదరుడు మరణించాడు. తన సొంతరాజ్యంలో అధికారం కోసం అంతరంగిక కుమ్ములాటలు లేవటంతో లైసియన్ జూడియన్లతో తాత్కాలిక శాంతి సంధిచేసుకున్నాడు. ఇది ఎంతోకాలం నిలబడలేదు. కొందరు విద్రోహుల సాయంతో జూడాస్‌ను, 800 గెరిల్లాలను చుట్టుముట్టి గ్రీకు సేనలు ఊచకోత కోశాయి.

జుడాస్ మరో సోదరుడు జొనాథన్ నాయకత్వం చేపట్టాడు. గ్రీకు పాలక ముఠాలతో డిప్లొమసీగా వ్యవహరించి రాజకీయ వ్యవహారాలను నడపాలనుకున్నాడు. జెరూసలెంకి ప్రధాన పూజారి అయ్యాడు. చివరికి గ్రీకు ప్రత్యర్థుల మోసానికి బందీ అయి బలయ్యాడు. మిగిలిన ఒకే ఒక్కడు సైమన్ సైనిక నాయకత్వం స్వీకరించాడు. గ్రీకు పాలకులతో సుదీర్ఘకాలం యుద్ధం

చేశాడు. ఈలోగా గ్రీకు రాజవంశీయులు రెండు ముఠాలుగా చీలి పరస్పర హననానికి సిద్ధపడ్డారు. సైమన్ సాయం కూడ అడిగారు. ఇదే అదునుగా సైమన్ మిలిటరీ నాయకుడు, ఆలయ ప్రధాన పూజారి పదవుల్ని చేపట్టాడు. వీరి వంశనామం హస్మోనియన్ పేరుతో క్రీ.పూ. 140 నుండి క్రీ.పూ. 37 వరకు యూదు రాజ్యపాలన కొనసాగించారు.

పైకి దేవుడు, మతం, ఆచార సంప్రదాయాల కోసం సాగిన పోరాటంగా కనపడినా, అంతిమ పరిశీలనలో అది విదేశీదురాక్రమణ, దోపిడీలకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటమే.

## యూదురాజ్యం పతనం – రోమన్ సామ్రాజ్యంలో విలీనం

గ్రీకు సామ్రాజ్యానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం ప్రారంభించి గద్దెనెక్కిన హస్మోనియన్ కుటుంబం చివరివరకు జూడియాలో వంశ పాలననే కొనసాగించింది. రాజు అనే పేరు లేకపోయినా, రాజరిక వంశ లక్షణాలన్నీ అబ్బినాయి. మతాన్ని, రాజ్యాన్ని ఏకంచేసి గుప్పెట్లో పెట్టుకుంది. నిరంకుశత్వానికి, అవినీతికి ఆలవాలమైంది. అధికారం కోసం కుటుంబంలో కుట్రలు, కలహాలు ప్రారంభమైనాయి.

సైమన్‌ను, అతని ఇద్దరు కొడుకులను అల్లుడే హత్యచేశాడు. మిగిలిన ఒక కొడుకు ప్రజల్ని పెద్దయెత్తున సమీకరించి రాజ్యాధికారం చేపట్టాడు. పాలస్తీనాలోని సమారియా, గలీలియా, ఏరియా, ఇడుమియాలను ఆక్రమించాడు. బలవంతంగా మత మార్పిడులను, సుంతీలను అమలుచేశాడు.

సైమన్ వారసులలో అధికారం కోసం కుమ్ములాటలు జరిగాయి. క్రీ.పూ. 76–67లో వితంతులైన సలోమి అలెగ్జాండర్ రాజ్యపాలన చేసింది. తన పెద్దకొడుకు హిర్కానస్‌కు ప్రధాన పూజారి, చిన్నకొడుకు అరిస్టొబులస్‌కి సేనాధిపతి పదవులను కట్టబెట్టింది. ఆమె మరణానంతరం ఇద్దరూ అంతర్యుద్ధానికి దిగి, సిరియాలోని రోమన్ కమాండర్ పాంపే మధ్యవర్తిత్వాన్ని కోరారు. సైమన్ కాలం నుండి యూదు పాలకులకి రోమ్‌తో సంబంధాలున్నాయి. ఎప్పటినుండో రోమ్ జూడియాపై కన్నేసింది. హిర్కానస్‌ను పరిమిత అధికారాలతో రాజును చేసింది. ఈ కొత్త తొత్తులపై యూదులు తిరుగుబాట్లు చేస్తూనే వున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా హస్మోనియన్ వంశీయులు రాజరికాన్ని నిలబెట్టుకోలేకపోయారు. వారి 103 ఏళ్ళ పాలన కూలిపోయింది. క్రీ.పూ. 40లో జూడియా రోమ్ సామ్రాజ్యంలో ఒక రాష్ట్రమైపోయింది.

హిర్కానస్ అల్లుడు, హీరోద్‌ను క్రీ.పూ. 37లో రోమన్లు రాజును చేశారు. ఇతడు రోమ్ పాలకులకు అత్యంత విశ్వాసపాత్రుడైన కుక్క. నిరంకుశంగా పాలించాడు. రక్షణకోసం కోటలు నిర్మించాడు. జెరూసలెం దేవాలయానికి పెద్ద పెద్ద భవంతులతో కొత్త రూపునిచ్చాడు. అయినా ప్రజలు అతనిని నమ్మలేదు. క్రీ.శ. 4లో చనిపోయాడు. పదేళ్ళ తర్వాత క్రీ.శ. 6లో ఆగస్టస్ చక్రవర్తి పాలనలో జూడియా రోమ్ సామ్రాజ్యంలో విలీనమైంది. జూడియాతోపాటు గలీలియా, సమారియాలపై కూడ రోమ్ ఉక్కుపాదం మోపింది. (ఇంకా వుంది)

# శ్రీ వేంకటేశ సుప్రభాత శృంగారం - వెనిగళ్ళ సుబ్బారావు

*(ఈ వ్యాసం 1982లో ప్రచురించిన శ్రీ వేంకటేశ సుప్రభాత శృంగారం పుస్తకంలోనిది)*

*(గత సంచిక తరువాయి)*

"ఒక నీలవేణి, పొడవైన వెంట్రుకలతో కొప్పుచుట్టి చల్లకడవతో ఒయ్యారంగా నడవటం వల్ల పైట చెంగు జారింది. నీ కొడుకు దానిని చాటుకు పిలిచి కొంగు లాగాడు."

"ఒక గుబ్బలాడి (బలిసిన స్తనాలుగలది) పాదాలు నేలకు కొట్టి నడుస్తుంది. ఆమె కంచు మట్టెలు గలగలా మోగుతున్నాయి. ఆ మందపు నడకలో అదను చూచి కాస్తలేదు నీ కొడుకు వేంకటేశుడు - తటాలున కౌగిలించుకొని పెదవి కొరికాడు." (12సం-241 కీర్తన)

వ్యభిచార కథానాయకుడైన కృష్ణుణ్ణి గురించి జయదేవుడు, లీలాశుకుడు వ్రాసిన బూతు గీతాల్ని చదివారు. కృష్ణుణ్ణి వేంకటేశ్వరుడనే పేరుతో తెలుగులో కీర్తనలు వ్రాసిన అన్నమయ్య విపరీత శృంగారాన్ని ఇపుడు రుచి చూశారు.

ఇప్పుడు అందరకు అర్థమయ్యే వ్యావహారిక తెలుగులో వ్రాసిన క్షేత్రయ్య పచ్చి బూతు పదాల్ని పరికించబోతున్నారు.

భర్తకు తెలియకుండా రాత్రంతా కృష్ణునితో సమరతులతో సంభోగించి తెల్లవారు తున్నందువల్ల పురుషాయితం కొరకు రేపు రమ్మని కృష్ణున్ని ఒక సంసార స్త్రీ బ్రతిమలాడుతున్న గీతాన్ని గానం చేయబోతున్నారు. పంక్తిలో వలపక్షం దేనికి? కానివ్వండి. (అయితే, దీన్ని క్షేత్రయ్య పదాల్లో ప్రకటించలేదు. కారణమేమో?)

జావళి :-

ప॥ తూరుపు తెల్లవారె రేపు వత్తువు గానీ పోరా ఈ వేళకు

అ.ప॥ నాపతి చూచిన రాపిడి సేయును
కాపురంబు నేడు కడగండ్ల పాలౌను
కోపమూనక నాపయిన్ పరితాపభారముఁ మాన్పరా
ఏపుమీర సుఖంబొసంగెద నౌపురీ గోపాలబాల॥ ॥తూ॥

చ॥1. కలకల రవముల ఖగము లెగయ జొచ్చె
నలువురు ఇటుఅటు నడయాడు వేళాయె
చెలువుడా! ఇక వెడలకున్నను, చిక్కులకు లోనగుదునకటా!
పిలువ నంపెద నిక్కముగ నిను, పెనుగులాడకు పుణ్యమాయె ॥తూ॥

2. మనసును ఇసుమంత మరలింప వలెగాని
మనకోరికల కెల్ల మరి మేరలేదు
ఎనసి సమరతు లందు ముచ్చట లెల్ల అనుభవించితినిగద?
ఒనరుగా పురుషాయితంబది ఒక్కటే గద తక్కువాయెను? ॥తూ॥

ఇటువంటిదే మరొక్కటి –

ప॥ ఎందుకు తొందర? సుందరాకార! నీ
పొందు కూడెద తాళరా॥

అ॥ప॥ సందె వేళలో మా వా రందరు తెలివిగా
నుందురు, బయటను పొందు గూడెద, కాళి
మందిరంబున కేను వచ్చెద,
పందిరి మాల్ పట్టె మంచము
నన్ దుకూల తల్పమున,
రతి బంధముల సుఖమొంద జేసెద॥ ॥ఎందు॥

చ॥ ఏ జామాయెరా వచ్చి? పోజాలవు నన్ను విడిచి
భోజనమునకు వేళాయెరా,
తిన్నతిన్నగ వచ్చి సరసోక్తులాడేవు
'ఏజెంటు' నామగడు ఏమనునో సామి? ॥ఎందు॥

ఈనాడు శ్రీకృష్ణుణ్ణి దేవుడుగా భావించి పూజించే భక్తులు భక్తురాండ్రు ఏ భావంతో పూజిస్తున్నారో ఆలోచించుకోవాలి. శ్రీకృష్ణ పూజంటే కామ తృష్ణ తీర్చుకోవడంతప్ప మరొకటి కాదని చెప్పే సుప్రభాత 28వ శ్లోక భావాన్ని జయదేవుడు తన గీతగోవింద కావ్యం, ప్రథమ సర్గ, 4–అష్టపది ద్వారా ఋజువు చేశాడు.

"చందన చర్చిత నీల కళేబర
పీతవసన వనమాలీ
కేళిచల న్మణికుండల మండిత
గండ యుగస్మిత శాలీ
హరిరిహ ముగ్ధ వధూనికరే
విలాసిని విలసతి కేళిపరే॥ హరి..." –1

తా॥ శ్రీకృష్ణుడు తన నల్లని శరీరం నిండా చందనం పూసుకొని, పీతాంబరాన్నీ, తులసి దండల్నీ ధరించి, క్రీడవల్ల కదులుతున్న రత్నకుండలాలతో అలంకరింపబడ్డ రెండు చెక్కిళ్లు కలిగి, చిరునవ్వుతో ప్రకాశిస్తూ ఈ బృందావనంలో శృంగార చేష్టలు గల అందమైన స్త్రీల గుంపులో శృంగారవంతుడై ఉన్నాడు.

"పీన పయోధర భారభరేణ
హరింపరిరభ్య సరాగమ్
గోప వధూరను గాయతి కాచి
దుదఞ్చిత పంచమ రాగమ్ హరి..." –2

తా॥ ఒక గొల్లభామ మోహాన్ని పట్టలేక, బాగా బలిసి, మిక్కిలి బరువుగావున్న తన స్తనాల ఉబలాటం తీరేట్లుగా శ్రీకృష్ణుణ్ణి గట్టిగా కౌగలించుకుని, అతడి వేణునాదంతో శ్రుతి కలుపుతూ, పంచమ స్వరంలో గొంతెత్తి విలాసంగా రాగాలాపన చేస్తుంది.

"కా ఽపి విలాస విలోల విలోచన
ఖేలన జనిత మనోజమ్
ధ్యాయతి ముగ్ధ వధూరధికం
మధు సూదన వదన సరోజమ్ హరి..." –3

తా॥ ఒక ముద్దరాలు హావభావాది శృంగార విలాసాల యందు కన్నుల్ని మనోహరంగా త్రిప్పుతూ, మన్మధుణ్ణి పుట్టించిన శ్రీకృష్ణుడి ముఖార విందాన్ని హఠాత్తుగా చూస్తూ, అలాగే నిలిచి, ఆ సౌందర్యానికి ఆశ్చర్యపడి, నిశ్చేష్టయై, అతని ముఖకమలాన్నే ధ్యానిస్తున్నది. (ముద్దరాలు= శృంగార విలాసాలయందు అంతగా ఆరితేరనిది)

"కా ఽపి కపోలతలే మిలితా
లపితుం కమపి శ్రుతి మూలే
కా ఽపి చుచుమ్బ నితంబ వతీ
దయితం పులకై రను కూలే హరి..." –4

తా॥ ఇంకొక యువతి మోహాన్ని ఆపుకోలేక, తనంతట తాను ప్రియుణ్ణి ముద్దు పెట్టుకున్నట్లయితే సిగ్గు లేనిదని సాటి వారు గేలిచేస్తారని ఆలోచించి, తన లావు పిరుదుల్ని కదిలించుకుంటూ, విలాసంగా కృష్ణుడి చెవిలో ఏదో రహస్యం చెప్పే దానివలె చెక్కిలి దగ్గర ముఖాన్ని చేర్చి, ఆ ముఖం తగులుటవల్ల గగుర్పాటు నొందిన శ్రీకృష్ణుడి చెక్కిలిని నొక్కి చక్కగా ముద్దాడుతుంది.

"కేళి కళా కుతకేన చ
కాచిదముం యమునా జలకూలే
మంజుల వంజుల కుంజగతం
విచకర్ష కరేణ దు కూలే హరి..." –5

తా॥ ఒక పిల్ల అందంగా ఉన్న ప్రబ్బలి పొదలో క్రీడించే శ్రీకృష్ణుడి పట్టుబట్టను చేతితో పట్టుకుని యమునా నదిలో స్నానం చేయాలనే వేడుకతో నవ్వుతూ లాగుతుంది.

"కరతల తాళ తరళ వలయావళి
కలిత కలస్వన వంశే
రాసరసే సహ నృత్యపరా
హరిణా యువతిః ప్రశశంసే హరి...." –5

తా॥ ఒక యువతి రాసక్రీడయందు కృష్ణుడి వెంట నాట్యం చేస్తూ, పాటకు తగినట్లు చేతి గాజులు గల్లుగల్లున మ్రోగేటట్లు తాళం వేస్తుండగా, ఆ నాదం వేణునాదంలో కలిసి పోయింది. అప్పుడు కృష్ణుడు ఆ చిత్రానికి ఆశ్చర్యపడి 'నీ నేర్పరితనమేమి?' అని ఆ స్త్రీని కొనియాడాడు.

"శ్లిష్యతి కామపి చుంబతి
కామపి రమయతి కామపి రామాం
పశ్యతి సశ్మిత చారుత
రామపరా మనుగచ్ఛతి వామామ్ హరి...." –7

తా॥ ఆ శ్రీకృష్ణుడు ఒక కోమలిని కౌగలించుకున్నాడు. ఒక యువతి చెక్కిలి నొక్కి ముద్దాడుతున్నాడు. ఒక రమణితో పురుషాయితం చేయించుకుంటున్నాడు ఒక స్త్రీ చక్కగా చిరునవ్వు నవ్వుతుండగా చూస్తూ ఉవ్విళ్లూరు తున్నాడు. ఒకతె ముందు పోతుండగా దానిననుసరించి పోతున్నాడు.

"శ్రీ జయ దేవ భణిత మిద మధ్భుత
కేశవ కేళిరహస్యం
బృందావన విపినే లలితం
వితనోతు శుభాని యశస్యమ్ హరి..." –8

తా॥ లోకంలో కీర్తిని కలుగజేసేదీ, హృదయానికి సంతోషకరమైనదీ, శ్రీకృష్ణుని అద్భుత క్రీడారహస్యాల్ని తెలిపేది అయిన శ్రీజయదేవుడి శ్రీసూక్తి వినేవాడికీ, చదివేవాడికీ శుభాన్నిచ్చుగాక!

ఈ రకంగా జయదేవుడు తన అష్టపదులద్వారా శ్రీకృష్ణుని శ్రుతిమించిన కామోన్మాదాన్ని ప్రకటించాడు. ఆ పచ్చి బూతు అష్టపదులు శ్రద్ధగా వినేవానికీ, నిష్టగా చదివేవానికీ మేలు కలిగించాలని దేవుడికి విన్నవించుకొంటున్నాడు.

ఇంతకంటే పరమ చండాలంగా క్షేత్రయ్య, విచ్చలవిడి పచ్చి బూతు పదాల్ని మువ్వగోపాలుని పేరుతో హద్దుమీరి తన బుద్ధిలేనితనాన్ని ప్రకటించుకొన్నాడు.

**క్షేత్రయ్య పదాలు :–**

మచ్చుకు మరికొన్ని మాత్రమే ఉదాహరిస్తున్నా, పరిశీలించండి.

"చెలువ। మువ్వగోపాలుడైన – శ్రీ వేంకటరమణా। యని
కిలకిల నగవుల నాయెదగుబ్బల గుమ్ముచు,
కళలంటి పరవశము జేసి – కంతు కేళి నన్నేలిన
మెలతను దలపనిపుడు నా – మేనెల్ల బులకరించెగా॥ 97

ఈ పదాల్లో మువ్వగోపాలుణ్ణి "శ్రీ వేంకటరమణా" (97), శ్రీ వెంకటేశుడు (130), వేంకటేశుడు (236), వెంకటనాథా, కడప వెంకటేశుడు (48) – అంటూ సంబోధించడం జరిగింది. దీనిని బట్టి మువ్వ గోపాలుడూ వెంకటరమణుడు ఒకడేనని, ఈ యిరువురిని క్షేత్రయ్య ఈ పద్యాల ద్వారా ఋజువు చేస్తున్నాడు.

"మువ్వ గోపాలుడైన శ్రీ వేంకటరమణా! అంటూ ఒక యువతి కిలకిల నవ్వుతూ, నా రొమ్ముమీద తన గుబ్బలేసి కుమ్ముతూ, అరవైనాలుగు కళలతో పరవశంచేసి, పురుషాయితంతో నాకానందాన్ని కలిగించిన యువతిని ఇపుడు తలచుకొంటే, నా వొళ్లు పులకరిస్తుంది" –

అనేది ఎడబాటును తెలుపుతుంది. ఆ ఎడబాటులో తన "ఎద" బాధను పోగొట్టుకోటానికి తాను లోగడ చేసిన రంకు తనాన్ని గుర్తుకు తెచ్చుకొంటున్నాడు మువ్వగోపాలుడైన వేంకట రమణుడు!

సుప్రభాత స్తోత్రం ఒకటో శ్లోకంలో లక్ష్మి తన చనుమొనలతో శ్రీకృష్ణుని రొమ్మునంతా ఎరుపు చేస్తే – ఈ క్షేత్రయ్య పదంలో, ఒక చెలువ తన బలిసిన స్తనాలతో మువ్వగోపాలుడైన వేంకటరమణుని రొమ్మును కుమ్మి ఆనందింప చేసింది. (ఇంకా వుంది)

# వ్యక్తుల ప్రయోజనాల కొరకే 'లాల్-నీల్' ఉద్యమాలు

మిత్రులారా, దళితులు అంటే 'నీల్' అని ముద్రవేయడం సరైనది కాదు! దళితులు అంటే 'లాల్'...! ఈ విషయం కొందరు మర్చిపోతున్నారు! కాదు, ఈ విషయం కొందరు కావాలనే, ఒకటికి వెయ్యిసార్లు చెపుతూ మరపింప చేస్తున్నారు!

అంబేద్కర్ జీవించినకాలం నుండి నేటి వరకు కూడా.. ఈ వ్యవస్థకు బలైపోయిన దళితులు తమ జీవన మనుగడకోసం, ఆత్మగౌరవం కోసం... కమ్యూనిస్టు పార్టీలో చేరి ఉద్యమిస్తున్నారు! ఉద్యమాల్లో అన్యవర్గ ధోరణులు పొడచూపినప్పుడు... వాటిని పరిష్కరించుకోవడానికి, ఆ ఉద్యమాల్లో.. విమర్శ – స్వయం విమర్శ, దిద్దుబాటు ఉద్యమం వంటి వేదికలున్నాయి. వాటి ద్వారా ఉద్యమ అవగాహనతో చర్చించుకుంటున్నారు, పరిష్కరించుకుంటున్నారు! అంతేకానీ.. దళితులకు, కమ్యూనిస్టులకు మధ్య... మైత్రి వేదికలు పెట్టి, ఐక్యత కుదిర్చే అంతగా శత్రుత్వం ఏనాడూ లేదు! ఇది జగమెరిగిన సత్యం! అంబేద్కర్ జీవించి ఉన్నప్పుడే ఇక్కడ 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం' జరిగింది. 'భూమి భుక్తి విముక్తి' కోసం అణగారిన ప్రజల ఆత్మగౌరవం కోసం మహోద్యమం జరిగింది. 'అయ్య నీ బాంచన్' అన్నవాళ్ళే దోపిడీ వర్గాల మీద తిరగబడ్డారు.

'లాల్ సిద్ధాంతం' కులం పుట్టుకకు, పేద ధనిక తేడాలకు కారణమైన దోపిడీ వర్గాలను రద్దు చేయాలంటుంది! 'నీల్ సిద్ధాంతం' రాజ్యాంగం ద్వారా, రాజ్యం ద్వారా ఆ వర్గాలను నిలబెట్టి ఉంచుతుంది! అందుకే, ఏ రకంగా చూసినా... 'లాల్–నీల్ మైత్రి' పద ప్రయోగమే సరైంది కాదు! ఇక ఆ పేరుతో వీరు ఉద్యమాలు నిర్వహించడం, లేని శత్రుత్వాన్ని వీరికి ఆపాదించడమే అవుతుంది! ఈ ప్రయోగ ఉద్యమం... వ్యక్తుల ప్రయోజనాలకే ఉపయోగ పడుతుంది తప్పా, సామాజిక, విప్లవ, విముక్తి ఉద్యమాలకు ఉపయోగపడదు! ఇక నిజమైన మార్క్సిస్టులు ఎవరైనా.. అంబేద్కర్‌ను, ఇతర సామాజిక ఉద్యమకారులనూ, హృదయపూర్వకంగానే గౌరవిస్తారు! సమాజ విముక్తి ఉద్యమాలకు అవసరమైన మేరకు, వారి అనుభవాలను స్వీకరిస్తారు. అందరినీ కలుపుకుపోతారు! అసలు విషయాలు మరుగునపరిచి, లేని విషయాలను ప్రచారం చెయ్యడం... శ్రామికవర్గ ప్రజలకు, సామాజిక ఉద్యమాలకు నష్టం చేకూర్చడమే అవుతుంది!

– సుభాష్

# అతి సూక్ష్మ ప్రపంచం

## నానో విజ్ఞాన సాంకేతికతపై ఒక చిన్న పరిచయం

మైక్రో అనే పేరు సూక్ష్మ పరిమాణాలకు దశాబ్దాలుగా వాడుకలో ఉంది. ఇప్పుడు అంతకన్నా చిన్న, 'అతి సూక్ష్మ' పరిమాణాలను తెలుపుటలో 'నానో' అనే పదం వాడుకలోకి వచ్చింది. నానో పరిమాణాల సామాన్యశాస్త్రంలో అయాన్ కణాల తయారీ, ధర్మాలు తెలుసుకొంటాం. నానో పరిమాణ పదార్థాలు గోళాకారంలోనూ, స్తూపాకారంలోనూ, గొట్టాల మాదిరిగానూ, దారాలు మాదిరిగానూ ఉంటాయి. ఉదాహరణకు కార్బన్ నానో ట్యూబ్ గొట్టం మాదిరిగా ఉంటుంది.

నానో సైన్స్, నానో టెక్నాలజీ అనేవి ఇటీవలి కాలంలో ప్రాచుర్యం పొందుతున్నాయి. ఇందుకు కారణం; రసాయనశాస్త్రంలోనూ, నూలు పరిశ్రమలలోనూ, ద్రవ్యశాస్త్రంలోనూ, వైద్యశాస్త్రంలోనూ, ఎలక్ట్రానిక్ పరికరాలలోనూ, మందుల పరిశ్రమలలోనూ, జన్యుశాస్త్రంలోనూ వీటికి గల అనేక సంభావ్య అనువర్తనాలు.

నానో అంటే శతకోటిలో ఒకటి. 'మీటరు' ను వెయ్యి భాగాలుగా విభజిస్తే 'మిల్లీ మీటరు'. మిల్లీ మీటరులో వెయ్యవ వంతు 'మైక్రో మీటరు', మైక్రో మీటరులో వెయ్యవ వంతు 'నానో మీటరు'.

1 మీటరు = 1000 మిల్లీమీటర్లు
= 1000000 మైక్రోమీటర్లు
= 1000000000 నానో మీటర్లు

$$1 \text{ నానో మీటరు} = \frac{\text{మీటరు}}{1000000000}$$

నానో కణాలను మనం కంటితో చూడలేము. చేతులతో తాకలేము. కారణం ఆ కణాలు అతి సూక్ష్మం కాబట్టి. భూమ్యాకర్షణ, జడత్వం వంటివి ఈ సూక్ష్మ కిరణాలపై చాలా తక్కువ ప్రభావం కలిగి ఉంటాయి. కాని తలతన్యత, అణు ఆకర్షణలు వీటిపై ముఖ్య భూమికను కలిగి ఉంటాయి. ఆకాశంలో గెలాక్సీలు, పాలపుంతలు ఎక్కువ మొత్తంలో ద్రవ్యం, పరిమాణం కలిగి ఉంటాయి. అధునాతన పరికరాలతో వాటిని పరిశీలించవచ్చు.

అతి సూక్ష్మ ప్రపంచం పూర్తిగా భిన్నమైనది. నానో కణాలను పరిశీలించడానికి అభివృద్ధి చెందిన రకరకాల సూక్ష్మదర్శినులను వాడవచ్చు. ఒక నానో కణాన్ని, ఒక మీటరు పదార్థంతో పోల్చడం అంటే ఆడుకొనే సీసపు గోళీని, భూమి పరిమాణంతో పోల్చినట్లు. ఎవరో సరదాగా చెప్పారట. ఒక మనిషి గడ్డం గీచేటప్పుడు ముఖానికి రేజర్‌ను దగ్గరకు తీసుకొని వచ్చే అతి స్వల్పకాలంలో వెంట్రుక పెరిగే పొడవు ఒక నానో మీటరు అని.

మనిషి జుట్టులోని ఒక వెంట్రుక వ్యాసం సుమారు పదివేల నానో మీటర్లు. ఇంకో విధంగా చెపితే భారతదేశ మొత్తం జనాభాలో ఒక మనిషిని 'నానో' గా పేర్కొనవచ్చు. ప్రకృతి కార్బన్‌ను

డైమండ్ లేదా గ్రాఫైట్‌గా మార్చితే, మనిషి కార్బన్‌ను నానో గొట్టాలుగా మార్చడం జరిగింది. పొగ గొట్టంలోని మసి ఏకమితీయ కార్బన్ నానో గొట్టానికి ఉదాహరణ.

ఉక్కు తీగలకన్నా, కార్బన్ నానో గొట్టాలు బలమైనవి. వెయ్యి రెట్లు విద్యుత్ వాహకత గలవి. వాటి బరువుతో పోల్చినప్పుడు లక్షల రెట్లు ఎక్కువ బరువు మోయగలవు. కార్బన్ నానో గొట్టాలు ఫుల్లరీను కుటుంబమునకు చెందినవి. అయితే ఫుల్లరీనులు గోళాకృతిలో ఉంటే, కార్బన్ నానో గొట్టాలు స్థూపాకృతిలో ఉంటాయి.

అతి సూక్ష్మ నానో పదార్థాల విలక్షణత ఏమంటే పదార్థం యొక్క కణ పరిమాణంపై పదార్థ ధర్మాలు ఆధారపడి ఉంటాయి. కాని నిజ ద్రావణాల, సాధారణ పదార్థాల ధర్మాలు పదార్థం యొక్క కణ పరిమాణంపై ఆధారపడవని గుర్తుంచుకోవాలి.

బంగారు లోహానికి రసాయన చురుకుదనం తక్కువ కనుక ఆభరణాల తయారీకి వాడతారు. కాని సూక్ష్మ పరిమాణ కణాలు గల బంగారానికి రసాయన చర్యాశీలత ఉంటుంది. చిన్న కణాలుగా ఉన్న బంగారం తక్కువ ఉష్ణోగ్రత వద్ద ద్రవీభవనం చెందితే, పెద్ద కణాలుగా ఉన్న బంగారం ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద ద్రవీభవనం చెందుతుంది.

అతి సూక్ష్మపదార్థాలు సాధారణంగా గోళాకారం, స్థూపాకారం, కడ్డీ ఆకారాలలో ఉంటాయి. ఈ కణాలను ఆవ గింజల లేదా బియ్యపు గింజల ఆకృతులలో కూడా తయారుచేయవచ్చు. లోహాలు, అర్ధవాహకాలు, లోహ ఆక్సైడ్లు మొదలగు వాటిని నానో స్ఫటికాలుగా తయారుచేయవచ్చు. అంతేగాక వీటిని నానో తీగల, నానో గొట్టాల, నానో పొరల ఆకృతులలోనూ పొందవచ్చు.

జీవ వ్యవస్థలలో 'క్రింది నుండి పైకి' విధానంలో నానో సాంకేతికతను వాడుకుంటారు. పరమాణువులు, అణువులు కలిసి కణాలను, అవయవ భాగాలను ఏర్పరచుటలో బంధాలను, అంతరణుక బలాలను అర్థం చేసుకోవడంలో నానో సాంకేతికత చాలా ఉపయోగం అని చెప్పాలి. ఈ దిశలోనే 'నానో వైద్య విధానం' కు అంకురార్పణ జరిగింది.

కణజాలం, జన్యువిధానం, మందులను ఎన్నుకోవడం, జీవ వైద్య నమోదు పరికరాలు మానవ ఆరోగ్య రక్షణకు మంచి బాటలు వేస్తున్నాయి. రోగ పర్యవేక్షణ కొరకు రోగి శరీరంలో అర్ధవాహక నానో చిప్‌ను అమర్చి వైద్య పరామితులు తెలుసుకొంటున్నారు. తద్వారా, జబ్బు నివారణకు ఇవ్వదగిన మందుల పరిమితి కనుగొంటున్నారు.

సౌందర్య పోషణ పరిశ్రమలో నానో సాంకేతికత ఒక విప్లవం తెచ్చి కొత్త దారిలో వెళ్ళుతుందనే చెప్పాలి. సౌందర్య దిగ్గజం ఒకటి 'నానోసోమస్' అనే పేటెంట్‌ను కూడా తీసుకుంది. నానో సోమస్ అంటే వెంట్రుకలో 800ల వంతు కన్నా చిన్న కణాలు. ఈ కణాలు బాహ్యచర్మంలోకి చొచ్చుకొనిపోయి లోపలి కణాలకు మందులు, పోషకాలను చేరవేస్తాయి. నానోసోమస్ చర్మం లోపలికి చొరబడే వేగం కూడా ఎక్కువ. లోపలి కణాలు శోషించుటకు సౌందర్యవర్ధన పదార్థాలు సాయపడడం వలన, కొత్త కణాలు జనిస్తాయి. కొత్త కణాల చేరిక వలన చర్మం మృదువుగా ఉండటమే గాక వయస్సు రీత్యా వచ్చే ముడుతలు రాకుండా ఉంటాయి. అంతేకాక కణాలలోని పనికిరాని చెత్తను ఇవి తొలగిస్తాయి.

సౌందర్య సాధన పరిశ్రమలో విటమిన్‌లు, వృద్ధి కారకాలు, చర్మ పునరుజ్జీవన లేపనాలు స్వల్ప పరిమాణ కణాల రూపంలో వాడుతున్నారు. కణ పరిమాణం తక్కువగా ఉండటం వలన

ఇవి రక్తం, శరీర ద్రవాలలో తేలికగా కలిసిపోతాయి. ఆహారనాళికలోనికి తీసుకొనే కొన్ని మందులు ఉపరితలంను నానో కణాలతో కప్పడం వలన కడుపులో చికాకు, శరీరంలో దురదలు రావని తెలుస్తోంది.

తామరాకు మీద నీటి బొట్లు నిలవవు. కారణం ఈ ఆకులపై సహజసిద్ధంగా జలాపేక్ష లేని అతి చిన్న కణాల రూపంలో మైనం ఉండి నీటిని వికర్షించడమే. దీనిని అనుకరిస్తూ నూలు పరిశ్రమ శాస్త్రవేత్తలు జలాపేక్ష లేని సిలికాన్ నానో ఫిలమెంట్లను తయారుచేసారు. మరకలు పడని, ముడతలు లేని విధంగా ఈ నానో పదార్థాలను నూలుపై అతి పలుచని పూతలుగా అమర్చుట వలన నూటికి నూరుపాళ్ళు అవి నీటిని శోషించవు. నీటి బిందువులు జారిపోతాయి. అందువలన దుమ్ము ధూళి బట్టలపై పోగుపడదు.

రోడ్లపై వాహనాలను కూడళ్ళలో నియంత్రించడానికి, విమానాలలో తలుపులు తెరవడానికి, హోటళ్ళలో వంట గదులలో పొగను గుర్తించడానికి, వ్యాపార నిలయాలలోనూ ఇళ్ళలోనూ దొంగతనాలు గుర్తించడానికి సెన్సార్లు వాడుక మనకు బాగానే పరిచయం. కాని ఇవి నానో సెన్సార్లు కావు. జంతువులలోనూ, మొక్కలలోనూ, బాహ్య అనుకరణలను స్వీకరించు గ్రాహకాలుగా నానో సెన్సార్లు వాడుకలోకి వచ్చాయి. ఉదాహరణకు ఒక పోలీస్ జాగిలం అతి సూక్ష్మరసాయన కణాలు ఆధారంగా వాసన పసికడుతుంది. అలాగే కొన్ని రకాల చేపలు నీటిలోని అతి చిన్న అలల ప్రకంపనలను గుర్తిస్తాయి. జబ్బుకు తగిన ఔషధం తీసుకోవడం ఒక సమస్య అయితే ఆ ఔషధం తాలూకా అణువులు రోగిలోని తగిన శరీర భాగం చేరడం మరొక సమస్య. ఈ సమస్యలను అతిక్రమించుటలో నానో సాంకేతికత ఉపయోగం మరువలేనిది.

రాగి పాత్రలో నీటిని కొన్ని గంటలు నిల్వ ఉంచి ఆ తర్వాత తాగితే ఆరోగ్యకరం అంటారు. కారణం తాగునీటిలో ఉండి హాని కలుగచేసే కొన్ని రకాల బాక్టీరియాను, ఫంగస్‌ను రాగి నాశనం చేస్తుంది. శతాబ్దాలుగా భారతదేశంలో వెండి లోహాన్ని ఉపయోగించి నీటిని శుద్ధి చేయడం తెలుసు. వెండి పొరలలో ఆహారాన్ని, తీపి పదార్థాలను దాచి తినడం కూడా తరతరాలుగా ఒక అలవాటు. నీటిని శుద్ధి చేయడంలో నానో పదార్థాలు, నానో శోషకాలు, జీవక్రియాశీల నానో కణాలు ఉపయోగించడం, నానో ఇంజినీరింగ్ భావనలు వాడడంవల్ల ఉత్తమ ఫలితాలు కన్పిస్తున్నాయి. ఇటీవలి కాలంలో నానో కార్బన్, నానో వెండి వంటి సూక్ష్మ కణాలను ఉపయోగించి నీటిని శుద్ధి చేస్తున్నారు.

విద్యుత్‌ను పొందడానికి వాడుకలో ఉన్న సంప్రదాయ ఇంధనాల దహనం కారణంగా వాతావరణం వేడెక్కుతూ ఉంది. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా భవిష్యత్ కాంతి పరికరాలు జ్వలించేవి కారాదు. నానో సాంకేతికతతో నడుపబడుతున్న ఎల్ఇడిల తయారీ చౌక. ఇవి చాలా కాలం మన్నుతాయి. వీటి వెలుగు సామర్థ్యం ఎక్కువ. హరిత గృహ వాయువులను విడుదల చేయకపోవడం వలన పర్యావరణ అనుకూలంగా ఉంటాయి. నానో కర్బన ఎల్ఇడి లను ఫ్లాష్ బల్బులుగానూ, ట్రాఫిక్ సిగ్నల్ దీపాలుగానూ, నిర్మాణరంగ దీపాలుగానూ వాడుతున్నారు. ఇవి చల్లని లేత నీలి కాంతినివ్వడం కారణంగా వీటిని చంద్రకాంతి దీపాలు అంటారు.

అతి స్వల్ప పరిమాణాల ప్రాథమిక భాగాలతో నిర్మితమైన కంప్యూటర్‌ను నానో కంప్యూటర్‌గా పిలుస్తారు. కంటికి కన్పించనంత చిన్న పరిమాణంలో ట్రాన్సిస్టర్, తర్కంగేట్, సమాకలన వలయాల కల్పనకు నానో ఎలక్ట్రానిక్స్‌ను ఉపయోగిస్తారు. నానో కంప్యూటర్‌లోని ట్రాన్సిస్టర్లుగా కార్బన్ నానో గొట్టాలను ఉపయోగిస్తున్నారు. సమాచారాన్ని నిక్షిప్తం చేయడం కోసం 'డియన్‌ఎ' అణువును ఉపయోగిస్తే దానిని డియన్‌ఎ కంప్యూటరుగా వాడుకలోనికి తెచ్చారు. దీని నిర్మాణంలో అణు జీవశాస్త్ర, కంప్యూటర్ శాస్త్ర పరిశోధన అంశాలు ఇమిడి ఉన్నాయి. సంక్లిష్టమైన పనితనం కారణంగా అసలు సమస్యకు సాధ్యమైన పరిష్కారాలను ఈ కంప్యూటర్ సూచించగలుగుతుంది.

నానో కల్పన విధానం ద్వారా పరమాణు ప్రబల సూక్ష్మదర్శిని వాడి స్కానింగ్ చేయడాన్ని నానో లిథోగ్రఫీ విధానం అంటారు. పరమాణు సూక్ష్మదర్శిని యొక్క కొనను 'మునిగి ఉన్న కలం'గా పరిగణిస్తారు. దీని ద్వారా పదార్థం యొక్క అణువులను ద్రవం ఉపరితలం పైకి తీసుకొని వస్తారు.

గత 10-12 సంవత్సరాలుగా నానో సైన్స్, నానో టెక్నాలజీలను ఉపయోగించి అతి చిన్న పరిమాణాలలో పదార్థ నిర్మాణం గురించి తెలిసికోవడం, కణాలలో పరస్పరం జరిగే సూక్ష్మ మార్పిడిని గుర్తించడం సాధ్యపడుతోంది. నానో సాంకేతికత భవిష్యత్తు ప్రకాశవంతంగానూ, ఆశాజనకంగాను ఉంది. అతి సూక్ష్మ పరిమాణాలలో కొత్త ధర్మాలను తెలిసికోగలగడం వల్ల ఉపయోగపడే వివిధ అనువర్తనాలకు అవకాశం మిక్కిలిగా ఉంది.

తెలియని విషయాలు ఎన్నో ఉంటాయి. పదార్థవాద, హేతువాద దృక్పథంతో వాటిని తెలుసుకోవడానికి నిరంతర పరిశోధన జరుగుతునే ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనలలో దాదాపు పదిశాతం అతి సూక్ష్మ ప్రపంచానికి సంబంధించినవే.

చెడిన చర్మానికి బదులు కృత్రిమ చర్మం అందుబాటులోకి రావడంతోబాటు, నాడీ వ్యవస్థ తనంతట తానుగా నిల్చునే రోజులు చాలా దగ్గరలోనే ఉన్నాయని అనుకొందాం. కాలుష్యం, చెడు ప్రభావాలు లేని విధంగా, మానవాళికి కీలకమైన ఎన్నో అవసరాల సాధనలో అతి సూక్ష్మప్రపంచం, అత్యంత సూక్ష్మ పరిమాణ కణాలను గురించి కూడా తెలిసికోగలదని, విజయం దిశగా ముందడుగు వేస్తుందని ఆశిద్దాం.

**- డా॥ మన్నం కృష్ణమూర్తి**

ప్రాంతీయ కార్యదర్శి, జాతీయ రసాయనశాస్త్ర ఉపాధ్యాయుల సమాఖ్య (ముంబయి)

---

*"దేవుడి గురిచ్చీ దొంగల గురిచ్చీ పోలీసోళ్ళ గురిచ్చీ*
*రాసకీయ నాయకుల గురిచ్చీ మనం డిస్కసన్*
*సేసుకోగూడదండి. తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు*
*దొంగ ముదిరి దొరవుతాడండి. దొర రంగుమార్చి రాజకీయ*
*నాయకుడవుతాడండి. ఈళ్ళని పోలీసోడు*
*కాపాడతాడండి. ఈళ్ళందర్నీ దేవుడు*
*దీవిస్తడండీ. ఇదంతా ఇలా కాకూడదన్నోడు నా దినంల*
*కమ్యూనిష్టండి. మీ దినాల్ల లక్సలైటండి"*

**- రావిశాస్త్రి**

# ఎన్నికల ఎత్తుగడే పౌరసత్వ చట్టం

– షేక్ కరిముల్లా

నేడు భారత ప్రజలను ఫాసిజం చుట్టుముట్టింది. అది అనేక రూపాలలో దేశ ప్రజల మీద విరుచుకు పడుతుంది. అందుకు తాజా ఉదాహరణే పౌరసత్వ చట్టం–2019. ఇప్పుడు దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సంక్షోభం ఆధునిక భారతదేశ చరిత్రలోనే చాలా ప్రత్యేకమైనది. ఇలాంటిది గతంలో ఎన్నడూ ఎదురుకాలేదు. ముస్లిం, దళిత, ఆదివాసి, వామ పక్షాలకు వ్యతిరేకంగా ఫాసిజం పనిచేస్తుందని అనుకోకూడదు. కొన్ని వందల, వేల ఏళ్ళుగా భారత సమాజం ఏర్పరచుకున్న భిన్నత్వంలో ఏకత్వం, భిన్న సంస్కృతుల సహజీవనం, భారతీయ జీవన విధానమైన లౌకికతత్వం లాంటి గొప్ప విలువలను ఈ ఫాసిజం నేడు ధ్వంసం చేస్తూ ఉంది. ఐతే ఈ ఫాసిజం ఇప్పటికిప్పుడు మొదలు కాలేదు. దీనికి బీజం 1925లో RSS పుట్టుకతో పడింది. ఇది 2014 లో BJP అధికారంలోకి రావటంతో దీని అసలు రూపం బయటపడింది. చరిత్రలో 1920 దశకంలో యూరప్‌లో ఫాసిజం పుట్టింది. సామ్రాజ్యవాదుల దోపిడీని విస్తరించి, మరింత దోచుకోవటమే దీని పని. చివరకు కమ్యూనిస్టుల (స్టాలిన్) చేతిలో చావుదెబ్బ తిన్నది. దేశంలో నేటి బ్రాహ్మణీయ ఫాసిజం ఆర్థిక దోపిడి శక్తులతో చేతులు కలిపి (ఆదాని, అంబాని) వారి సంపద పెరుగుదల కోసమే అధికారంలో ఉన్న పార్టీ బరితెగించి మరీ పనిచేస్తూ ఉంది. మొత్తం ఫాసిజాన్ని ఆర్థిక కోణంలో చూస్తే తప్ప సంఘ్ పరివార్ దుర్మార్గాలు అర్థం కావు. ఈ శక్తులు నిత్యావసరాల ధరలు, పేదరికం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, రైతుల ఆత్మహత్యలు, దళిత, ఆదివాసి, మైనారిటీలపై అత్యాచారాలు, హత్యలపై ఏనాడూ మాట్లాడదు. ప్రజలకు దక్కాల్సిన సహజవనరుల దోపిడీని ప్రశ్నించదు. పైపెచ్చు రాజ్యాంగం ద్వారా నిర్మితమైన వ్యవస్థలను నిర్వీర్యపరచి, దుర్వినియోగం చేస్తూ ఉంది. ఇదంతా దేశభక్తి ముసుగులో చేస్తూ ఉంటుంది. ప్రజలు ఈ వాస్తవాలను గ్రహించి, దేశాన్ని ఈ దుష్టశక్తుల నుంచి విముక్తి చేసుకోవాలి.

కలిసి మెలిసి జీవిస్తున్న భిన్న మతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టటం ద్వారా రానున్న పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయంగా లబ్ది పొంది, అధికారంలోకి వచ్చేందుకు BJP ప్రభుత్వం ఈ ఎన్నికలకు ముందు వివాదాస్పద పౌరసత్వ చట్టం తెచ్చింది. గత పదేళ్ళుగా అధికారంలో ఉన్న BJP గతంలో ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కింది. మంచి పనులు చెప్పుకోవటానికి ఏమీలేక ఇప్పుడు ఏమాత్రం అవసరంలేని దుర్మార్గ పౌరసత్వ చట్టం తెచ్చి, కలిసి జీవిస్తున్న ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తుంది. తద్వారా ప్రజల మౌలిక సమస్యలపై నుంచి దృష్టి మరలిస్తుంది. అలాగే హిందూ ప్రజల ఓట్లను మతం మత్తులో పోల్ చేసుకొని తిరిగి అధికారంలోకి రావటానికే ఈ పన్నాగం తప్ప వేరే ఏమీ లేదు.

ముస్లిం మెజారిటీ దేశాలైన ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో మత పరమైన పీడనకు గురైన వారు భారతదేశంలోకి ప్రవేశించిన హిందూ, సిక్కు, తదితర మతాల వారికి భారత పౌరసత్వం ఇస్తారట. కాని ముస్లింలకు ఇవ్వరట. మరియు శ్రీలంక, భూటాన్ నుంచి వలస

వచ్చిన వారిని కూడా చేర్చలేదు. ఎందుకంటే ఈ రెండు దేశాలు బౌద్ధ మత దేశాలు. అలాగే మయన్మార్‌లో రోహింగ్యాలు పీడనకు గురౌతున్నారు. వీరికి కూడా స్థానం లేదు. చట్టం ముందు అందరూ సమానులేనని చెప్పే రాజ్యాంగం లోని 14వ అధికరణ ప్రకారం మతం ఆధారంగా పౌరసత్వం ఇచ్చే అవకాశం లేదు. ఆచరణలో ఈ చట్టం ముస్లిం మతస్తులకు వ్యతిరేకం. వీరిలో అభద్రతా భావం పెరిగిపోతూ ఉంది. ఇప్పటికే ముస్లింలను రెండవశ్రేణి పౌరులుగా చూస్తున్నారు. ఈ చట్టం అమలు ద్వారా ముస్లింలతో పాటు అధిక సంఖ్యలో హిందువులు కూడా ఇబ్బంది పడతారు. ముఖ్యంగా పేదలు, SC, ST, ఆదివాసీలు నష్టపోతారు.

మౌలికంగా ఈ చట్టం రాజ్యాంగ వ్యతిరేకమైనది. పౌరసత్వ సవరణ చట్టం - 2019 స్పష్టంగా ఆరు మతాల పేర్లు ప్రస్తావించింది. మిగిలిన మతాల పట్ల ముఖ్యంగా ముస్లిం మతస్తుల పట్ల వివక్షను ప్రదర్శించింది. రాజ్యాంగంలోని లౌకిక భావనకు, ప్రవేశికకు వ్యతిరేకమైనది. ప్రధానంగా నాలుగు ప్రాథమిక హక్కులను ఈ చట్టం ఉల్లంఘిస్తున్నది. అధికరణ - 14 చట్టం ముందు పౌరులందరూ సమానమే. అధికరణ - 15 రాజ్యం ఏ వ్యక్తి పట్ల మత ప్రాతిపదిక మీద వివక్ష చూపకూడదు. అధికరణ - 16 అవకాశాలలో పౌరులందరి మధ్య సమానత్వం పాటించాలి. మత ప్రాతిపదిక మీద అవకాశాలు నిరాకరించకూడదు. అధికరణ-25 ఏ వ్యక్తికైనా మత స్వేచ్ఛకు హామీ ఇస్తుంది. ఈ చట్టం ఈ హక్కును ఉల్లంఘిస్తున్నది. మొత్తంగా ఈ చట్టం రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విఘాతం కలిగిస్తున్నది. సమాజాన్ని విడదీస్తున్నది. కపటంతో కూడిన ఈ చట్టం మెజారిటీ మతం వారి ఆధిపత్యం కొనసాగిస్తూ, ముస్లిం ప్రజలను వివక్షకు గురిచేస్తున్నది. BJP ఎంతో కాలంగా ప్రయత్నిస్తున్న 'హిందూ రాష్ట్ర' ను ఏర్పాటు చేసే ఉద్దేశమే ఈ చట్టం. ఈ చట్టం రాజ్యాంగంలో పొందుపరచిన విలువలను, హక్కులను హరిస్తున్నది. కాబట్టి ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకించాలి. ఫాసిజం ఈ రోజు ఒక భయానక శక్తిగా కనిపించవచ్చు. ఐతే అది తప్పక ఓడిపోతుంది. ఆ లక్షణం దాని గర్భంలోనే ఉంది. దాని సిద్ధాంతం, స్వభావంలోనే ఉంది. మానవ వ్యతిరేకమైనవన్నీ చరిత్రలో మట్టి కరిచాయి. ఈ శక్తులు కూడా అంతే.



మానవతావాది, నాస్తికులు

## ఆర్. యాకోబుకు జోహార్లు!

హుజూర్‌నగర్ వా॥లు ప్రముఖ నాస్తికులు, మానవతావాది **ఆర్. యాకోబు** (78) 2024 ఫిబ్రవరి 3వ తేదీన మరణించారు. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి విశేష కృషి చేశారు. చార్వాకాశ్రమంలో జరిగిన అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు.

ఆర్. యాకోబు మరణానికి నాస్తికసమాజం సంతాపం తెలియచేస్తోంది.

# ఉత్తేజాన్నింపిన 32వ జాతీయ నాస్తిక మేళా, భారతీయ విశిష్ట తాత్త్విక నిలయం 'చార్వాకాశ్రమం' అర్ధశతాబ్ది ఉత్సవాలు

ప్రతి సంవత్సరం ఫిబ్రవరి రెండవ శనివారం, ఆదివారం గుంటూరు జిల్లా, మంగళగిరి సమీపములోని చార్వాకాశ్రమంలో జరుగుతున్న నాస్తికమేళా ఈ సం॥ 2024 ఫిబ్రవరి 10, 11 తేదీలలో జరిగింది. 10వ తేదీ ఉదయం పది గంటలకు 'భారత హేతువాద సంఘాల సమాఖ్య' అధ్యక్షులు ప్రొఫెసర్ నరేంద్ర నాయక్ నాస్తిక సమాజం జండా ఆవిష్కరించారు. నాస్తిక సమాజం నాయకులు బి. శ్రీనివాసరావు నినాదాలు ఇవ్వగా, భా.నా.స నాయకులు జీడి సారయ్య బృందం పాటలు పాడారు. ఉదయం కార్యక్రమానికి నాస్తికసమాజం నాయకులు గోపు చంద్రరావు స్వాగతం పలుకుతూ-చార్వాకాశ్రమం నిర్వహించిన కార్యక్రమములను, చార్వాకాశ్రమంతో తనకు గల అనుబంధాన్ని తెలిపారు. చార్వాకాశ్రమం (1973-2023) స్థాపించి 50 సం॥ నిండిన సందర్భముగా -

**స్వర్ణ ఉత్సవాల సంతోష సమయాన**
**స్వాగతంబు మీకు సాదరముగ**
**ఏబదేండ్లు నిండె ఈయాశ్రమానికి**
**రెండు రోజు లిచట పండుగోలె గడిపి**
**అమరమూర్తి మనదు రామకృష్ణను తలచి**
**వీడికోలు చెబుదు వెళ్లుదాము.** పద్యమును ఆలపించారు.

నాస్తిక సమాజం జాతీయ ఉపాధ్యక్షులు, ఫిరా కార్యదర్శి ఎమ్.ఎన్.బుద్ధ ఉదయం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

"శాస్త్రీయ దృక్పథం" అనే అంశంపై 'ఫిరా' అధ్యక్షులు ప్రొఫెసర్ నరేంద్ర నాయక్ మాట్లాడుతూ - మన మందరం నాస్తికులం. మన మందరం మానవవాదులం కావాలి. మానవ వాదం అనేది ఒక జీవన విధానం. మన రాజ్యాంగం ఆర్టికల్ 51 (A) (H) రూల్ IVA ప్రకారం పౌరులలో శాస్త్రీయ స్పృహను పెంపొందించాలి. కానీ ప్రస్తుత పాలకులు వారసత్వ సంపద పేరుతో రాజ్యాంగంలో మార్పులు తీసుకువచ్చి మనువాద సంస్కృతిని తీసుకురావడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతిపక్షాలు, అభ్యుదయవాదులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో వున్నారు. మనకు స్వాతంత్ర్యం రావడానికి పూర్వం 'బ్రిటిష్ ఇండియా యాక్ట్' ద్వారా మనదేశంలో కొంతమందికి మాత్రమే ఓటు హక్కు వుంది. కానీ స్వాతంత్ర్యానంతరం మన రాజ్యాంగం ద్వారా మన దేశంలోని పౌరులందరికీ ఓటు హక్కు కల్పించబడింది. రాజ్యాన్ని, మతాన్ని వేరుచేయమని నెహ్రూ ఆనాడే చెప్పారు. ప్రస్తుత పాలకులు సనాతనధర్మం మంచిదనీ, ప్రజల్ని నమ్మించడానికి, ఆ భావజాలానికి బానిసల్ని చేయడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులలో మనం ఉద్యమాలు ఏఏ రూపాల్లో చేయాలి? మన లక్ష్యాలు ఏమిటి? అనే విషయం గురించి చర్చించాలి అని అన్నారు.

"మూఢవిశ్వాసాలు - నిర్మూలన" అనే అంశంపై సి.పి.ఐ మాజీ నాయకులు, మూఢవిశ్వాసాల నిర్మూలన కోసం పోరాటం చేసిన పి. శ్రీనివాసుల నాయుడు మాట్లాడుతూ - తెలంగాణ

ప్రాంతంలో ప్రజలలో మూఢనమ్మకాలు పెరగడానికి గల కారణాలు, బాధితులను మూఢనమ్మకాల బారి నుండి ఏ విధంగా చైతన్య పరిచింది వారి ప్రత్యక్ష అనుభవాలను వివరించి చెప్పారు. ప్రజలలో వున్న అవిద్య, అజ్ఞానం, ఆర్థికపరమైన వెనుకబాటుతనం, కుల సమస్య మూఢ విశ్వాసాలు పెరగడానికి కారణమనీ, మూఢవిశ్వాసాల బాధితులతో మనం మాట్లాడే సమయంలో వారితో మమేకమై వారి సమస్యలను, వారి జీవన విధానాలను తెలుసుకుని పరిస్థితులకు తగినట్లుగా వ్యవహరించాలని తెలిపారు. ప్రస్తుత పాలకులు మతాన్ని, మతవిశ్వాసాలను ప్రజలలో రెచ్చగొట్టి తమ ప్రయోజనాలను కాపాడుకొంటున్నారని, మనం చెపుతున్న సిద్ధాంతం వేరు, ఆచరణ వేరుగా వుండకూడదని మనం ఏమి చెబుతున్నామో వాటిని ఆచరించాలని అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో మనం ఎంతో జాగ్రత్తగా కొత్త కొత్త విధానాలతో ప్రజలను చైతన్యపరచి మతోన్మాద ఫాసిస్టుల నుండి ప్రజలను కాపాడాలని అన్నారు.

మధ్యాహ్నం జరిగిన కార్యక్రమానికి 'స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు' టి.శ్రీదేవి స్వాగతం పలుకగా - నాస్తిక సమాజం నాయకులు చింతక్రింది జనార్ధన్ అధ్యక్షత వహించారు. "కృత్రిమ మేధ - మానవాళికి మేలా?" అనే అంశంపై భౌతిక శాస్త్ర అధ్యాపకులు కె. రవీంద్ర కుమార్ ఉపన్యసించారు. 'అతి సూక్ష్మ ప్రపంచం' అనే అంశంపై రసాయన శాస్త్ర అధ్యాపకుల సమాఖ్య కార్యదర్శి డా॥ మన్నం కృష్ణమూర్తి ఉపన్యసించారు.

"సామ్రాజ్యవాదం - యుద్ధాలు" అనే అంశంపై APTF పూర్వ అధ్యక్షులు A.నరసింహారెడ్డి మాట్లాడుతూ - 1916లో లెనిన్ సామ్రాజ్యవాదాన్ని విశ్లేషించి 5 సూత్రీకరణలు చేశారు. 1.వస్తూత్పత్తిలో కొంతమంది పారిశ్రామిక వేత్తలే పెద్ద పెద్ద పరిశ్రమలను స్థాపిస్తారు. వీరే మార్కెట్‌పై ఆధిపత్యాన్ని చెలాయిస్తారు. 2. బ్యాంక్‌లో సంపదను దాచుకున్న పెట్టుబడిదారులు, పరిశ్రమల నిర్వహణలోకి; అలాగే పరిశ్రమల నిర్వహణ పెట్టుబడిదారులు బ్యాంక్‌ల నిర్వహణలోకి మారుతారు. అంటే, బ్యాంక్ డైరెక్టర్స్ బోర్డులకి పారిశ్రామిక వేత్తలు- సభ్యులుగానూ, పారిశ్రామిక డైరెక్టర్స్ బోర్డ్‌లోకి బ్యాంక్‌ల వారు వెళతారు. ఈ దశను ద్రవ్య పెట్టుబడి దశ అంటారు. 3. వస్తూత్పత్తి కొరకు అనేక దేశాలలో పరిశ్రమలు స్థాపించి అక్కడనే చౌకగా - ముడిసరుకులు, శ్రమశక్తిని తీసుకొని వస్తూత్పత్తి చేసి ఆ దేశాలలో రాయితీలు పొంది వ్యాపారం చేయడం. లాభాలు పొందడం. వస్తు వినిమయ స్థానంలో ద్రవ్య వినిమయం జరుగుతుంది. 4. ప్రపంచంలో రకరకాల రంగాలలో ఉత్పత్తులు చేసే బహుళజాతి సంస్థలు ఆయా రంగాలవారీగా విభజించు కుంటాయి. 5. సామ్రాజ్యవాద దేశాలు మార్కెట్ మీద పెత్తనం కోసం, లాభాల కోసం సహజ వనరులున్న దేశాలపై ఆధిపత్యం చెలాయించడం. యిప్పుడు సామాజ్యవాదం ప్రపంచీకరణ దశకు చేరుకుంది. గతంలో ద్రవ్య పెట్టుబడికి జాతీయ స్వభావం వుండేది. ఇప్పుడు ప్రపంచీకరణ తరువాత ద్రవ్య పెట్టుబడి జాతీయ స్వభావాన్ని కోల్పోయి అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థగా మారింది. ఇది లెనిన్ ఊహించలేదు అని అన్నారు

సామ్రాజ్యవాద దేశాల మధ్య యుద్ధం అనివార్యం. సామ్రాజ్యవాదమంటే యుద్ధమే అని లెనిన్ అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు సామ్రాజ్యవాదం చివరి దశ అని అన్నారు. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థ ఊసరవెల్లి లాగా ప్రపంచీకరణగా రూపం మార్చుకుంది. అందువలన సామ్రాజ్యవాద దేశాలు యుద్ధం చేసుకోవు. పెట్టుబడిదారులు ఆర్థిక సంక్షోభాన్ని నివారించు

కోవడానికి రెండు మార్గాలున్నాయి. 1. యుద్ధం 2. సాంకేతికతను పెంపొందించుకోవడం. చమురు నిక్షేపాలపై ఆధిపత్యం కోసమే అమెరికా అనేక దేశాల మధ్య యుద్ధాలను ప్రోత్సహిస్తుందనీ ఈ రోజు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి తన ఆర్థిక సంక్షోభాలను నివారించుకోవడానికి అన్ని దేశాలలో మతవాద, మితవాద రాజకీయాలను ప్రోత్సహిస్తున్నది అని అన్నారు.

"ఆహారం – ఆరోగ్యం" అనే అంశంపై డా॥ YSR హెల్త్ యూనివర్సిటీ ఆఫ్ సైన్సెస్ పూర్వ రిజిస్ట్రార్ డా॥ కె.శంకర్ మాట్లాడారు.

సాయంత్రం కార్యక్రమానికి భౌతికవాది అడకాపురం చంద్రమౌళి స్వాగతం పలుకగా– నాస్తికసమాజం నాయకులు ఎస్.చలపతిరావు అధ్యక్షత వహించారు. "మత గ్రంథాలు–పరిశీలన" అనే అంశంపై ముస్లిం సత్యశోధక్ మండల్ అధ్యక్షులు డా॥ షంషుద్దీన్ ఎం. తంబోలి మాట్లాడుతూ – నాకు ఈ జాతీయ నాస్తికమేళాలో పాల్గొనడం చాలా ఆనందంగా వుంది. మా ముస్లిం సత్యశోధక్ మండల్ స్థాపించి 55 సం॥రాలు అయినది. ముస్లిం స్త్రీలు మత ఛాందసవాదం, అవిద్య, అజ్ఞానం వలన శాస్త్రీయ దృక్పథానికి దూరంగా వెనుకబడి వున్నారు. ముస్లిం సమాజంలో బహుభార్యత్వం ఇంకా వుంది. మా సంస్థ ద్వారా మతాంతర వివాహాలు అనేకం జరిగాయి. ముస్లిం పర్సనల్ లాకు మేం వ్యతిరేకంగా పోరాడుతున్నాం. నేటి ప్రభుత్వం చేస్తున్న ఉమ్మడి పౌరస్మృతికి, రాజ్యాంగంలో పొందుపరిచిన ఉమ్మడి పౌరస్మృతికి చాలా తేడా వుంది. దేశభక్తి గల సమసమాజాన్ని నిర్మించడమే మా సంస్థ యొక్క లక్ష్యం. ఈ నాస్తికమేళాలో మా సంస్థ వ్యవస్థాపకులు హమీద్ దల్వాయ్ ఇంటర్వ్యూలను తెలుగులో ప్రచురించి ఆ పుస్తకాన్ని నాతో ఆవిష్కరింప చేయడం చాలా ఆనందంగా వుంది. మేము మరాఠీలో "పీడనలు ఖండించండి" అనే పుస్తకాన్ని ప్రచురించాము. ఆ పుస్తకములో మత మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా వ్యాసాలున్నాయి. వాటిని తెలుగులోకి అనువదించవలసినదిగా కోరుతున్నాను. దేవుడు – మతాలను మనిషే సృష్టించాడనీ, మరియు శరీరదానం, అవయవదానములను ప్రోత్సహిస్తున్నా మని తెలియచేశారు.

ప్రముఖ వైద్యులు డా॥ గోపాళం శివన్నారాయణ తన సందేశమిస్తూ – మన దేశంలో కులము – మతము – అవినీతి – అజ్ఞానం–ప్రాంతీయతత్త్వం వుంది. ప్రతి ప్రాణికి పుట్టుకతో శరీరం, ఊపిరి వస్తాయి. సమానత్వం, మానవత్వం, సంస్కారం, దేశభక్తి, అనేవి ప్రతి మనిషికి వుండాలి. సమాజంలో నిజం, అబద్ధం రెండే వుంటాయి. నిజం వున్న చోట మోసం వుండదు. బలవంతుడు బలహీనుణ్ణి పీక్కుతింటున్నాడు. బలహీనుడు బలవంతుడు కావాలి. ప్రకృతిని పరిరక్షించాలి. నీతి, న్యాయం, ధర్మం, ఇతరులకు సహాయం చేయటం తేనెవంటిది. మత సంస్కృతి – విద్య, వ్యాపారం, రాజకీయాలకు స్త్రీలను దూరం చేసింది అని అన్నారు.

"నాస్తికవాద కార్యాచరణ. వారి అనుభవాలు–కర్తవ్యాలు" అనే అంశంపై భా.నా.స నాయకులు జీడి సారయ్య, చైతన్య గంగిరెడ్డి ఉపన్యసించారు.

రాత్రి 7 గంటలకు ఫిరా అధ్యక్షులు ప్రొఫెసర్ నరేంద్ర నాయక్ చేసిన 'మహిమల ప్రదర్శన' ప్రతినిధులను ఆకట్టుకుంది.

ఫిబ్రవరి 11వ తేది ఉదయం కార్యక్రమానికి భౌతికవాది సృజన శ్రీను స్వాగతం పలుకగా– నాస్తిక సమాజం నాయకులు కె. బెన్‌హర్‌బాబు అధ్యక్షత వహించారు. ఇతర రాష్ట్రాల నుండి (కర్నాటక, గుజరాత్, తమిళనాడు, హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్ర ప్రతినిధులు తమ సందేశాలను తెలిపారు.

"మన మానవ మూలాలు" అనే అంశంపై విద్యావేత్త డా॥ జయకుమార్ గారు మాట్లాడుతూ - మానవ మూలాలు ప్రకృతిలో ఉన్నాయి. మన అందరి ఆయుష్షు 300 కోట్ల సంవత్సరాల కంటే ఎక్కువ. ఆక్సిజన్ ప్రకృతిలో ఏర్పడి 300 కోట్ల సంవత్సరాలయింది. ఆక్సిజన్‌లో చాలా భాగం మార్పు చెందకుండా మన దగ్గరికి వచ్చింది. మానవ మూలాల్లో జరిగిన పరిణామాలు ఏంటి అని ఆలోచిస్తే మనం కోతుల నుండి వచ్చాము. కోతుల నుండి కొన్ని పదుల లక్షల సంవత్సరాలు రకరకాల మ్యుటేషన్స్, రకరకాల పరిణామాలు జరిగి మనుషులుగా పరిణామం చెందాం. పరిణామం గురించి చాలా మంది కోతులు మనుషులుగా పరిణామం చెందితే కోతులు అలాగే ఎందుకు మిగిలి ఉన్నాయి అని అడుగుతూ ఉంటారు. ఇలాంటి వారి మెదడు చిన్న పిల్లల మెదడు కంటే ఎక్కువగా పెరిగినది కాదు. సరియైన పరిస్థితులు అనుకూలించినప్పుడు సరియైన మ్యూటేషన్స్ ప్రతి అడుగులో జరిగినప్పుడు మాత్రమే కొన్ని కోతులు మనుషులుగా మారాయి. అన్ని కోతులు మనుషులుగా మారడానికి అవకాశం లేదు. ప్రకృతి ఒక పజిల్ లాంటిది. దానిలో కొన్ని కోతులు మాత్రమే మనుషులుగా మారడానికి అవకాశాలు ఉన్నాయి. ఈ చిన్న విషయం చాలామంది గొప్ప గొప్ప విద్యావంతులకు కూడా అర్థం కాకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది అని అన్నారు.

"నేటి పరిస్థితులలో భౌతికవాదుల కర్తవ్యాలు" అనే అంశంపై భౌతికవాది అనిశెట్టి సాయికుమార్ మాట్లాడుతూ - ప్రపంచంలో ఒక ప్రక్క శాస్త్ర సాంకేతిక రంగంలో అనేక దేశాలు పురోగమిస్తుంటే, మన దేశం మత మూఢవిశ్వాసాలతో వెనుకబడి వుంది. ఈ పరిస్థితులు ఎందుకు వున్నాయి? గతములో జరిగిన ప్రజా ఉద్యమాలు, పోరాటాలు అప్పటి కృషి గుర్తుకు వస్తే - ఈరోజు ఆ పోరాట పటిమ, చైతన్యం, స్ఫూర్తి ఏమైంది అని అనిపిస్తుంది. సైన్స్ వేరు, శాస్త్రీయ దృకృథం వేరు. పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించడం లేకుండా చేయడానికి పాఠ్యాంశాలలో డార్వినిజం పాఠాన్ని తొలగించారు నేటి పాలకులు. కృత్రిమ మేధను వాడుకొని ప్రజల్ని ప్రక్కదారి పట్టిస్తున్నారు. మన సోదర సంఘాల మధ్య వున్న మిత్ర వైరుధ్యాన్ని శత్రు వైరుధ్యంగా చూస్తున్నామని అందువలన మన సంఘాల బలం తగ్గిపోయిందని అన్నారు. ప్రజల మధ్య కులాల పేరుతో, మతాల పేరుతో, ప్రాంతాల పేరుతో వైరుధ్యాలు పెట్టడం, మతవాదుల యొక్క లక్షణం. మన దేశంలో వున్న పురాణ కథలు, యిందుకు వుదాహరణలు. గతములో కుల అస్థిత్వ ఉద్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావచ్చని కొంతమంది ప్రయత్నం చేశారు. కానీ, అవి ఆచరణలో విఫలం అయ్యాయనీ అన్నారు.

మధ్యాహ్నం సమావేశానికి కులనిర్మూలనా పోరాటసమితి నాయకులు జె.శ్రీనివాస్ ఆహ్వానం పలుకగా 'చార్వాక' పత్రిక గౌరవ సంపాదకులు డా॥ భానుప్రసాద్ అధ్యక్షత వహించారు. "భారతీయ సమాజం - మానసిక బానిసత్వం" అనే అంశంపై మార్క్స్- అంబేద్కర్ అధ్యయన వేదిక అధ్యక్షులు డా॥ బి.వి.రాఘవులు మాట్లాడుతూ - మన మందరం ఇక్కడ ఎందుకు కలిశామంటే భారతీయ సమాజాన్ని మెరుగైన సమాజంగా తీర్చిదిద్దడానికి, ఇక్కడ మనం చెప్పుకున్న విషయాలు విని మీలో మార్పు వస్తేనే మీరు నేర్చుకున్నట్లు. మీరు మారిన మనుషులుగా వెళ్ళి సమాజాన్ని మార్చాలి. భారత దేశంలో మనిషికి, మనిషికి మధ్య వున్నది కుల సంబంధాలు

మాత్రమే. భారతదేశాన్ని వేల సంవత్సరాలుగా కులసమస్య పట్టిపీడిస్తూ వుంది. ఈ అసమానతలతో నిండిన ఈ కులవ్యవస్థకు, దోపిడీకి, అతినీతికి వ్యతిరేకంగా చార్వాకుల నుండి ఇప్పటి వరకూ పోరాడతూనే వున్నాం. బానిసత్వం రెండు రకాలు 1. నిర్బంద బానిసత్వం, 2. మానసిక బానిసత్వం. నిర్బంధ బానిసత్వం అంటే మనిషి స్వేచ్ఛను హరించి, బంధించి తమ పనులు చేయించుకోవడం. వీరు శారీరకంగా బంధింపబడినా తమ స్వేచ్ఛ కోసం నిరంతరం ఆలోచిస్తూ వుంటారు. కానీ మానసిక బానిసత్వంలో వున్న వ్యక్తికి తను మానసిక బానిసత్వంలో వున్న విషయమే తెలియదు. ఏ వ్యవస్థ అయితే అతన్ని మానసికంగా బానిసత్వానికి లోను చేసిందో ఆ వ్యవస్థను అతను అంగీకరిస్తాడు. మన దేశంలో నూటికి తొంభైశాతంగా వున్న మూలవాసులకు చదువు, సంపద, ఆయుధం లేకుండా చేసి మనలను మానసికంగా బానిసలుగా చేసింది ఈ వర్ణవ్యవస్థ అని అన్నారు. మీరు ధర్మాన్ని రక్షిస్తే – అది మిమ్మల్ని రక్షిస్తుంది అని చెప్పారు. ఆ ధర్మం ఏమిటంటే కులధర్మం, మనుధర్మం మాత్రమే. మన రాజ్యాంగం ప్రజాస్వామిక పునాదుల మీద ఏర్పడింది. మన వ్యవస్థ, అప్రజాస్వామిక పునాదుల మీద ఏర్పడింది. మన వ్యవస్థ స్వేచ్ఛకు విరోధి, సమానత్వానికి శత్రువు. కుల భావన బలహీనపడితేనే మనుషులుగా దగ్గరవుతాము అని అన్నారు.

'ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం' నాయకులు ఎస్.హనుమంతరెడ్డి మాట్లాడుతూ– పాలస్తీనా సమస్య, గత 130 రోజులుగా జరుగుతూ దాదాపు 27 వేల మంది మరణించడానికి, 80 వేల మంది గాయపడడానికి, 12 వేలమంది కనిపించకుండా పోవడానికి కారణమయింది. ఇది యూదులు పాలస్తీనియన్లపై చేస్తున్న యుద్ధం. యూదులు రోమన్ సామ్రాజ్య కాలం నుండి కూడా చాలా తెలివైన వారు. వారిలో వడ్డీ వ్యాపారులు, శాస్త్రవేత్తలు మొ॥న వారు వున్నారు. మొదట పాలస్తీనా ప్రాంతం రోమన్ సామ్రాజ్యం కింద వుండేది. అప్పుడు ఇజ్రాయెల్ దేశం లేదు. పాలస్తీనా మాత్రమే వుంది. పాలస్తీనాలో 5 మతాలున్నాయి. ఈరోజు జరుగుతున్న యుద్ధానికి దైవ స్థల పవిత్రతా భావం, మత ఛాందసవాదం, సామ్రాజ్యవాదం కారణాలు. బ్రిటిష్ సామ్రాజ్యవాదం వలన ఇజ్రాయెల్ దేశం స్థాపించబడింది. అమెరికా సామ్రాజ్యవాదం కారణంగా ఆ తరువాత కూడా యుద్ధాలు కొనసాగింపబడుతున్నాయి. 1964లో పాలస్తీనా ఉద్యమం నీరుగార్చడానికి 'పాలస్తీనా లిబరేషన్ ఆర్మీ' ఏర్పాటయింది. 'హమాస్' ను ఇజ్రాయెల్ సృష్టించింది. 'హమాస్' చేసిన దాడిని ప్రతిచర్యగానే మనం చూడాలి అని అన్నారు.

'తత్త్వశాస్త్ర చరిత్ర – గతితార్కిక భౌతికవాదం' పుస్తకమును పౌరహక్కుల సంఘం నాయకులు డా॥ టి. రాజారావు ఆవిష్కరించి మాట్లాడుతూ – సత్యమైనా సూత్రమైనా మన మనస్సుకు వెలుపల స్వతంత్రంగా వుంటుంది. అది ఆచరణలో ఋజువు కావాలి. ప్రజల కార్యాచరణలో, భౌతిక ఉత్పత్తి కృషిలో నిగ్గుతేలాలి. ఆచరణే జ్ఞానానికి కొలబద్ద.

మన కళ్ళ ముందున్న ప్రపంచాన్ని భౌతిక ప్రపంచం అంటున్నాం. ఈ భౌతిక ప్రపంచాన్ని నమ్మేదీ, దాన్ని గురించి వివరించేదీ భౌతికవాదం. విశ్వమంతా పదార్థమే. పదార్థం సృష్టింపబడదు. నాశనం గావింపబడదు. పదార్థంలో శక్తి ఇమిడి వుంటుంది. శక్తి కూడా పదార్థమే. పదార్థానికి జడత్వం లేదు. చలనంతో వుంటుంది. చలనం లేని పదార్థం లేదు. పదార్థానికి చలనమే గాదు. నిర్దిష్ట స్థలము, కాలము కూడా వున్నాయి.

“గతి” అంటే గమనం, చలనం, మార్పు. ‘తర్కం’ అంటే వాదన. గ్రీకులో Dialectics అంటారు. పదార్థ పరిణామాన్ని, అభివృద్ధిని పరిశీలించే విధానం, దానిని అధ్యయనం చేసి అర్థం చేసుకోవడంలో అవలంబించే పద్ధతి గతితర్కం. పదార్థ చలనానికి మూలాన్ని, అది ఎలా, ఎటుగా పయనించుతుందో తెలియజేసేదే గతితార్కిక భౌతికవాదం. జ్ఞానానికి, జీవిత సమస్యలకు, మరో ప్రపంచం కోసం జరిగే పోరాటానికి గతితార్కిక భౌతికవాదం గైడ్‌లాంటిది.

ప్రకృతిని గతితార్కిక భౌతికవాద సూత్రాల ప్రకారం అర్థం చేసుకుని ఆ సూత్రాలను సమాజానికి, చరిత్రకు అన్వయించిన దాన్ని ‘చారిత్రక భౌతికవాదం’ అంటున్నాం. గతితార్కిక, చారిత్రక భౌతికవాద వెలుగులో సమకాలీన సంక్లిష్టతలను అర్థం చేసుకొని పరిష్కార మార్గాలను కనుగొలం – అని అన్నారు.

ఇంకా ఈ నాస్తికమేళాలో సమతా శ్రీధర్ రచన ‘ప్రస్థానం’ నవల, (పునర్ముద్రితం) మరియు సమతా శ్రీధర్ గ్రానైట్ పలకలపై అందంగా చెక్కిన అభ్యుదయ వాదుల చిత్రములు ఆవిష్కరణ మరియు ముస్లిం సత్యశోధక్ మండల్ వ్యవస్థాపకులు హమీద్ దల్వాయ్ ఇంటర్వ్యూలను తెలుగులో గౌరవ్ అనువదించగా ఆ పుస్తకమును డా॥ షంషుద్దీన్ ఎం. తంబోలి ఆవిష్కరించారు. ‘తత్త్వశాస్త్ర చరిత్ర–గతితార్కిక భౌతికవాదం’ పుస్తకమును డా॥ టి. రాజారావు ఆవిష్కరించారు. ఈదర గోపీచంద్ రచన “తెనెటీగ కాదది విషపు తేలు” పుస్తకమును, డా॥ చిట్టిబోయిన కోటేశ్వరరావు రచన “ఔను కదా!” (హేతువాద శతకం), డా॥ షంషుద్దీన్ ఎం. తంబోలి రచన “తిమిర్ భేద్” (మరాఠి పుస్తకం), ఎస్.డి.వి. అజీజ్ రచన “అల్లూరి సీతారామరాజు” (హిందీ పుస్తకం) లను ఆవిష్కరించారు.

కార్యదర్శి నివేదికను నాస్తిక సమాజం నాయకులు లతీఫ్ చదివి వినిపించారు. ప్రజాకళా మండలి కళాకారులు కోటి, నాగేశ్వరరావు, రాణి బృందం, ఆం.ప్ర. ప్రజానాట్య మండలి కళాకారులు ఆర్. పిచ్చయ్య, ఎ. రామారావు, భా.నా.స కళాకారులు జీడి సారయ్య బృందం సాంస్కృతిక ప్రదర్శనలివ్వగా – గంజి ఈశ్వరలింగం, పల్లవోలు రమణ సాంస్కృతిక కార్యక్రమములను పర్యవేక్షించారు.

*నాస్తిక సమాజం నాయకులు : సత్యనారాయణ 32వ నాస్తికమేళాకు ముగింపు పలికారు.*



**32వ జాతీయ నాస్తికమేళాలో జెండా ఆవిష్కరణ**

# జాతకాలు అబద్ధాలు! – మా.శ్రీ.రాజు

జమలాపురంలో జమలయ్యకి జాతకాలు పిచ్చి ఎక్కువ. తన కూతురు జానకికి పెళ్ళీడు వచ్చేసరికి మంచి వరుడికోసం వెతుకులాట ప్రారంభించాడు. చూసిన సంబంధాలలో చాలా సంబంధాలు మంచివే వచ్చినా, జాతకాలు కలవలేదని జమలయ్య వాటన్నిటిని వదులుకొని మళ్ళీ వెతుకులాట ప్రారంభించాడు.

"వచ్చినవన్నీ మంచి సంబంధాలే మీ జాతకాలపిచ్చితో అన్నీ వదులుకుంటున్నారు. జాతకాలు చూపించి బోలెడు డబ్బులు వదిల్చుకుంటున్నారు. జాతకాలు ఒట్టి అబద్దాలు అయినా మీకు ఈ జాతకాలు పిచ్చి ఏమిటి?" అని పదోతరగతి చదువుతున్న ప్రకాష్ తండ్రిని ప్రశ్నించాడు.

"నీ మొహం నీకు తెలియదు చిన్న పిల్లాడివి నువ్వు నోరు మూసుకో జాతకాలు కలవకుండా చేస్తే చాలా కష్టాలు వస్తాయి" అని జమలయ్య తన జాతకాల పిచ్చిని సమర్థించుకొని, వెతగ్గా వెతగ్గా ఒక సంబంధం దొరికింది. అబ్బాయి, అమ్మాయి జాతకాలు చక్కగా కుదిరాయి. భేషైన సంబంధం అని జమలయ్య ఉబ్బితబ్బిబ్బై, బాగా కట్నం ఇచ్చి, ఎంతో ఘనంగా కూతురు జానకి పెళ్ళి చేశాడు. పెళ్ళయిన కొద్ది కాలానికి కూతురు నెల తప్పింది. తాను తాతని కాబోతున్నాననీ జమలయ్య చాలా సంతోషించి, కూతుర్ని డాక్టరమ్మ దగ్గర పరీక్ష చేయించాడు. డాక్టరమ్మ రొటీన్‌గా హెచ్.ఐ.వి. టెస్ట్ చేయగా హెచ్.ఐ.వి. పాజిటివ్ వచ్చింది. జమలయ్యకి గుండె పగిలినంత పనై, అల్లుడికి టెస్ట్ చేయిస్తే అతనికి హెచ్.ఐ.వి వుంది. 'జాతకాలు నమ్మకొని చేయిస్తే ఇలా జరిగిందేమిటి?' అని జమలయ్య అంతులేని బాధకి లోనై గుండెపోటుతో హాస్పటల్‌లో చేరాడు.

జమలయ్య భార్య జయమ్మ లభోదిభోమని గుండెలు బాదుకుంటూ, అంతులేని దుఃఖంతో భోరుభోరున ఏడ్చింది. ఇగ జమలయ్య కూతురు జానకి సంగతి సరేసరి, అంతులేని దుఃఖంతో కన్నీరు మున్నీరై విలపించింది. "నాన్నా! జాతకాలు ఒట్టి అబద్దాలు అని నేను చెబితే విన్నారా? మీ జాతకాల పిచ్చితో నన్ను కసురుకొని, నా నోరు మూయించి, మీ ఇష్టం వచ్చినట్లు చేశారు. జాతకాల్ని నమ్ముకోకుండా, వచ్చిన సంబంధాలలో మంచిది ఎంపిక చేసుకొని, రక్తపరీక్ష చేయించి పెళ్ళి చేస్తే, ఈ పరిస్థితి వచ్చేది కాదుగా" అన్నాడు అంతులేని దుఃఖంతో కొడుకు ప్రకాష్.

"నిజమేరా. జాతకాలు ఒట్టి అబద్దాలు. జాతకాల్ని నమ్ముకోవటం తప్పు అయిపోయింది. నువ్వు చెప్పినట్లు చేస్తే చాలా బాగుండేది" అన్నాడు అంతులేని ఆవేదనతో జమలయ్య.

ఈ కథంతా రంగయ్య రమణయ్యకి చెప్పి "ఇప్పుడు చెప్పు నీ కూతురు వేరే కులం వాడిని ప్రేమించిందని, నీ కులం కాదని, వేరే సంబంధాలు చూస్తున్నావు. జాతకాలు కలవలేదని అన్నీ వదులుకుంటూ, మళ్ళీ వెతుకులాడుతున్నావు. ఎవడో ముక్కు ముఖం తెలియని వాడికి ఇచ్చి చేస్తే, రేపు ఏదైనా చెడు జరిగితే, ఏం చేస్తావు? చేతులు కాలాక ఆకులుపట్టుకున్నా ప్రయోజనం వుండదు. అబ్బాయి సంగతి అమ్మాయికి; అమ్మాయి సంగతి అబ్బాయికి పూర్తిగా తెలుసు. ఇష్టపడ్డ వాళ్ళకి చేస్తే మంచి జరుగుతుంది" అన్నాడు రంగయ్య.

"అవును నువ్వు చెప్పింది నిజమే. జాతకాల్ని నమ్ముకొని మోసపోయిన జమలయ్య సంగతి నాకూ తెలుసు. నువ్వు నా కళ్ళు తెరిపించావు. జాతకాలు అబద్దాలు. నాకు నా కూతురు సుఖమే ముఖ్యం. కులం కాదు. గుణమే ముఖ్యం. వాళ్ళిద్దర్ని ఒక్కటి చేస్తాను" అన్నాడు. మారిన మనస్సుతో రమణయ్య. రమణయ్య మారినందుకు రంగయ్య చాలా సంతోషించాడు.

# ఆహారం - ఆరోగ్యం

## LOW CARBOHYDRATE HIGH FAT (LCHF) DIET

## పుట్టు పూర్వోత్తరాలు

**డా॥ కె. శంకర్,** M.D., DTCD,

"Those who don't know history are destined to repeat it" - Edmund Burke (1729-1797), British Statesman and Philosopher

మనిషి జీవించినంత కాలం శారీరక, మానసిక ఆరోగ్యాలు బాగుండాలంటే సరైన ఆహారం తీసుకోవడం తప్పనిసరి. ఆరోగ్య రక్షణలో మందుల (Medicines / Drugs) పాత్ర పత్యక్షంగా అందరికీ కనపడుతుంది. అయితే 'ఆహారం' పాత్ర అలా కనపడదు. ఆరోగ్య రక్షణలో ఆహార పాత్రను సరిగ్గా అర్థం చేసుకోకపోవడం వల్లనే మనం 'మందులకు' అధిక ప్రాధాన్యతను ఇస్తున్నాము. నేడు మనం తీసుకునే గాలి, నీరు మరియు ఆహారం వివిధ కాలుష్యాలు లేదా రసాయనాలతో కలుషితమైనవే. ఆహారం మన శరీరాలపై 'మందు' లాగానే పనిచేస్తుంది. మనం తీసుకునే ఆహారం రసాయనాలతో కలుషితమైనా కాకపోయినా 'ఆహారాన్ని' మనం 'మందు' లాగే పరిగణించాలి. అందుకు అనుగుణంగానే WHO మందుని (Drug)ను ఇలా నిర్వచించింది. "A drug is any substance or product that is used or intended to be used to modify or explore Physiological Systems or Pathological States for the benefit of the recepient".

జీవనశైలి వ్యాధులు (అధిక బరువు. షుగర్ వ్యాధి టైప్–2, హైబి.పి. గుండె జబ్బులు మొ॥) ప్రపంచ వ్యాప్తంగా అంటువ్యాధుల్లా ప్రబలడానికి ప్రధాన కారణం మన ఆహారపు అలవాట్లే. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రతి నలుగురిలో ఒకరికి ఊబకాయం సమస్య ఉంది. ప్రపంచంలో అత్యధిక మధుమేహం ఉన్న దేశాల్లో మనం 2వ స్థానంలో ఉన్నాము. ముందస్తు మధుమేహాన్ని (Pre-diabetes mellitus) పరిగణనలోకి తీసుకుంటే దేశంలో ప్రతి నలుగురిలో ఒకరికి మధుమేహం సమస్య ఉంది. ప్రతి ఏడుగురిలో ఒకరికి కిడ్నీ సమస్య ఉంది. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (NFHS) తాజాగా నిర్వహించిన సర్వే నివేదిక ఇలా ఉంది. దేశ వ్యాప్తంగా 25%, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 36.49% ప్రజలకు హైబిపి ఉంది! అలాగే దేశ వ్యాప్తంగా 27%, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 34.11% ప్రజలకు మధుమేహం ఉంది! ఈ గణాంకాలను బట్టి మనందరమూ ఎంత ప్రమాదంలో ఉన్నామో అర్థమవుతుంది.

ఈ జీవనశైలి వ్యాధులు సృష్టించే రకరకాల సమస్యల (కాంప్లికేషన్స్) వల్ల, దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులన్నీ కిక్కిరిసి పోతున్నాయి. ఫలితంగా, ప్రజలపై ఆర్థిక భారం పెరిగి పోయింది. ఈ వ్యాధులవల్ల ప్రజల పనిదినాలు తగ్గడమే కాకుండా జీవన నాణ్యత (Quality of Life) తగ్గిపోయింది. అకాల మరణాలు పెరిగాయి.

అన్ని జీవన శైలి వ్యాధులకు ప్రధాన కారణం అధిక పిండి పదార్థాలే అని పరిశోధనలు నిరూపించినప్పటికీ, ప్రపంచ వ్యాప్తంగా వైద్యులు కాలం చెల్లిన సమతుల్య ఆహారాన్నే (Balanced diet) సూచిస్తున్నారు. అందులో కార్బోహైడ్రేట్స్ 60%, ప్రోటీన్లు 25%, కొవ్వులు మరియు పీచు పదార్థాలు కలిపి సుమారుగా 15% ఉంటాయి. ఖనిజ లవణాలు, విటమిన్లు

మరియు నీరు కూడా సమతుల్య ఆహారంలో భాగంగా ఉంటాయి. వైద్య జీవ రసాయన శాస్త్ర (Bio-chemistry) పాఠ్యాంశాల్లో ఈ రకపు ఆహారాన్నే సూచించారు. రోజూ 20 గ్రాములకు మించకుండా పిండి పదార్థాలు, 150 గ్రాముల హెల్తీ కొవ్వు పదార్థాలు మరియు కిలో బరువుకు 1-1.5 గ్రాముల చొప్పున ప్రోటీనులు తీసుకోవడమే LCHF Diet విధానంలో ఉన్న ప్రధాన అంశం. చరిత్రలో ఇప్పటి వరకు సంప్రదాయ విధానాలను ప్రశ్నించిన ఏ సిద్ధాంతం, ఏ శాస్త్రీయ ఆవిష్కరణా సులభంగా ప్రయాణించలేదు. అవి తిరస్కారానికి, అవహేళనకు మరియు కొన్నిసార్లు దాడులకు గురి అయిన తర్వాతే సమాజ ఆమోదాన్ని పొందాయి! ప్రస్తుతం LCHF diet విధానం కూడా ఈ పరిస్థితినే ఎదుర్కొంటూ ఉంది!

**జీవనశైలి వ్యాధులకు పునాదులు ఏమిటి?**

మానవజాతి తొలిరోజుల్లో ఆహార సంపాదన "వేట సేకరణ" (Hunter - Gatherer) విధానాల్లో జరిగేది. తర్వాత పరిణామ క్రమంలో వ్యవసాయ శాస్త్ర సాంకేతిక విప్లవాల మూలంగా అవసరానికి మించి అనేక రెట్లు ఎక్కువగా ఆహారాన్ని ఉత్పత్తి చేయడానికి వీలైంది. ముడి ఆహారం నుండి మొదలై సూపర్ ప్రాసెస్డ్ ఆహార పదార్థాలు, జీరో కొలెస్ట్రాల్ నూనెలు మరియు సాఫ్ట్ డ్రింక్స్ వరకు చేరుకున్నాము. నేడు రీఫైన్డ్ ధాన్యాలు, రీఫైన్డ్ నూనెలు, రీఫైన్డ్ పిండి పదార్థాలు ప్రపంచాన్ని ముంచెత్తుతున్నాయి. సంపద పోగుపడే క్రమంలో ఆహార విషయంలో ఒక గుణాత్మక మార్పు చోటుచేసుకుంది. ఆహారం వల్ల ఆకలి తీరడం అనే భావన దాటి రుచికరమైన ఆహారం ద్వారా సంతోషాన్ని, తృప్తిని పొందడం కోసం మనిషి అర్రులు చాచాడు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఇన్స్టంట్ పదార్థాల (Instant Foods) వెల్లువ మొదలైంది. కార్బోహైడ్రేట్ పదార్థాలకు 3 ప్రత్యేక గుణాలు కలిగి ఉన్నాయి. 1. తయారుగా (సిద్ధంగా) ఉండడం 2. రుచికరంగా ఉండడం 3. తక్కువ ధరలో లభ్యమవడం. ఈ గుణాలవల్ల ప్రజలు వీటికి తేలిగ్గా అలవాటు పడుతుంటారు. మద్యపానం, ధూమపానం లాగానే పిండి పదార్థాల ఆహారం కూడా ఒక వ్యసనం. దీని నుండి బయటపడడం అంత తేలిక కాదు! వ్యసన పరంగా (Addiction liability) చూస్తే, మాదక ద్రవ్యం అయిన 'కొకైన్' కంటే పిండి పదార్థాలు 8రెట్లు శక్తివంతమయినవి.

మనం అధికంగా, తరచుగా తీసుకొనే పిండి పదార్థాలవల్ల మన శరీరంలోని పాంక్రియాస్ గ్రంథి ఉత్తేజితమై, ఈ పిండి పదార్ధాలనుండి వెలువడే గ్లూకోసు శరీర కణాలు గ్రహించేందుకు వీలుగా "ఇన్సులిన్" అనబడే హార్మోన్‌ను అధికంగా, నిరంతరంగా స్రవిస్తుంది. ఈ పరిస్థితినే "హైపర్ ఇన్సులినేమియా" (Hyperinsulinemia) అని అంటారు. దీని మూలంగా ఇన్సులిన్ నిరోధకత (Insulin Resistance) ఏర్పడుతుంది. ఎక్కువ మోతాదులో ఉన్నప్పటికి ఇన్సులిన్ పనిచెయ్యదు. షుగర్ లెవెల్స్ పెరుగుతాయి. అంతేకాకుండా కాలేయంలోను, పాంక్రియాస్ మరియు ఇతర కణజాలాలలోనూ కొవ్వు నిల్వలతయారీని ప్రేరేపిస్తూ, కొవ్వు నిల్వలను బయటకు రానీయకుండా ఇన్సులిన్ అడ్డుకుంటుంది. ఫలితంగా, 'మెటబోలిక్ సిండ్రోమ్' లక్షణాలు వస్తాయి. ఈ సిండ్రోమ్‌నే 'X' సిండ్రోమ్ (X Syndrome) అని కూడా పిలిచేవాళ్ళు. మధుమేహం టైప్-2, హైబీపి, ఊబ పొట్ట ఈ మెటబోలిక్ సిండ్రోమ్‌లో భాగమే. ఈ సిండ్రోమ్‌లో ఉండే 'X' ఫ్యాక్టర్‌ను నేడు ఇన్సులిన్ నిరోధకత (Insulin Resistance) గా గుర్తించారు.

(ఇంకావుంది)

# గాంధీ - భగత్‌సింగ్

- దివికుమార్

**(ఈ వ్యాసము "నా నెత్తురు వృథా కాదు" పుస్తకం నుండి గ్రహించడమైనది)**

(గత సంచిక తరువాయి)

కానీ తన కొద్ది సంవత్సరాల రాజకీయానుభవంలోనే భగత్‌సింగ్, గాంధీ గురించి, కాంగ్రెసుపార్టీ గురించి చాలా స్పష్టమైన అభిప్రాయాలు ప్రకటించాడు. అందులోనూ తాను ఉరితీయబడటానికి సరిగ్గా 51 రోజుల ముందు చేసిన రచన ఇది. అప్పటికి స్టాలిన్ రచనలు అంచనాలు భగత్‌సింగ్‌కి అందుబాటులోకి వచ్చి వుండకపోవచ్చు. కానీ మార్క్సిజాన్ని లెనినిజాన్ని అధ్యయనం చేసిన తన పరిజ్ఞానం నుండీ భారత జాతీయోద్యమానుభవాల నుండి ఈ అభిప్రాయానికి వచ్చి వుండవచ్చు.

"కాంగ్రెసు ఉద్యమం (దీన్ని ఈనాడు గాంధీవాదం పేరుతో చెప్పటమే సరైనది) యొక్క ఫలితాలు, వైఫల్యాలు, శక్తి సామర్థ్యాలు గురించి మనసులో ఎలాంటి భ్రమలు పెంచి పోషించుకోరాదు. మనం కళ్ళారా చూస్తూనే వున్నాం. ఇది స్వాతంత్ర్యాన్ని సమర్థించేది కానేకాదు. పైగా భాగస్వామ్యాన్ని కోరుతోంది. దేనినయితే సంపూర్ణ స్వరాజ్యం ప్రతిబింబిస్తుందో 'భాగస్వామ్యం' దానికి విరుద్ధమయిన వ్యాఖ్య. కాంగ్రెసు పద్ధతులన్నీ విలక్షణమయినవి. అది ప్రజల్ని ఎంతలా నిస్సహాయులుగా మార్చివేసిందంటే గాంధీవాదానికి సబర్మతీ సంత్‌కి మరొక జతగాడుగాని (వారసుడుగాని) లభించడు. వాస్తవ పరిస్థితులను చూడ నిరాకరించే లిబరల్, రాడికల్ సభ్యులతో ఏర్పడిన కిచిడీ (కలగూరగంప) పార్టీ భూమికను ఇది నిర్వహిస్తోంది. బూర్జువా రుణగ్రహంతో తమ బొక్కసాలకు ప్రాధాన్యతనిచ్చే సంపన్నుల నియంత్రణ ఈ పార్టీ మీద ఎక్కువగా వుంది. విప్లవకారులు తమ రక్తం ఓడ్చి దీన్ని తమ మార్గం నుంచి తప్పించలేక పోయారో ఇదే అడ్డంకికాక తప్పదు. దాన్ని దాని మిత్రులనుండే రక్షించాలి" ('భారతజాతి విముక్తి పోరాట దిశలు')

గాంధీ సిద్ధాంతాలు, ఆయన ఆచరణ ఏవర్గ ప్రయోజనాలకు తోడ్పడేవి అన్న విషయము మొత్తం జాతీయోద్యమం నడిచిన తీరుని అర్థం చేసుకోవడం అవసరం. అంతేకాదు మనకు లభించింది, జాతీయ స్వాతంత్ర్యమా లేక కేవలం అధికార మార్పిడేనా? భారతదేశంలో సామ్రాజ్యవాదులకు అనుకూలమైన దళారీ బూర్జువావర్గం పూర్వం నుంచి వున్నదా? లేక బూర్జువా వర్గమంతా జాతీయ స్వభావం కలిగి వున్నదా? అధికారంలో కొచ్చిన నల్లదొరల స్వభావం ఏమిటి? నేటి సామాజిక వ్యవస్థ అర్ధవలస-అర్ధఫ్యూడల్ స్వభావం కలిగివుండి జనతా ప్రజాతంత్ర విప్లవ పరిష్కారాన్ని కోరుతున్నదా? లేక పెట్టుబడిదారీపంథాలో పయనిస్తూ సోషలిస్టు లక్ష్యం కలిగివున్నదా? మొదలైన అనేక కీలక సమస్యలకు దీనితో ముడిపడిన సంబంధం వుంది. ఈ అంచనాలమీద ఆధారపడే ఎవరైనా తమ కార్యక్రమాల్ని, పంథాని నిర్ణయించుకుని లక్ష్యసాధనకి కృషి చేస్తారు. తప్పుడు అంచనాలు తప్పుడు ఆచరణకే దారితీయటం సహజం.

వైస్రాయి ఇర్విన్ ప్రయాణం చేస్తున్న రైలు పేలిపోయే విధంగా విప్లవకారులు దాని కింద బాంబు పెట్టారు బాంబు పేలింది కానీ వైస్రాయి ఏ అపాయము లేకుండా తప్పించుకొన్నాడు.

గాంధీ తన సహజ ప్రభుభక్తితో వైస్రాయి ప్రాణాపాయం నుండి బయటపడ్డందుకు ఎంతగానో సంతోషించాడు. కాంగ్రెసు సభలలో విప్లవకారుల చర్యలను ఖండించటానికి తీర్మానాన్ని కొద్ది మెజారిటీతో నానాకష్టపడి పాస్ చేయించుకొన్నాడు. తర్వాత కల్ట్ ఆఫ్ ది బాంబ్ (బాంబు ఆరాధన) అనే వ్యాసం రాసి విప్లకారుల మీద నిందల వర్షం కురిపించాడు. దానికి సమాధానంగా విప్లవకారులు ఫిలాసఫీ ఆఫ్ బాంబ్ (బాంబు తత్త్వం) అనే జవాబిచ్చారు. అందులో కాంగ్రెసు నాయకత్వ స్వభావం గురించి ఇలా పేర్కొన్నారు.

"కాంగ్రెసు ప్రజలలో స్వాతంత్రేచ్ఛను కలిగించిందని మేమూ ఒప్పుకొంటాం. అయితే అంతటితో కాంగ్రెసు బాధ్యత తీరిపోలేదు. దేశానికి కాంగ్రెసు చేయవలసింది ఎంతో వుంది. కానీ ఆ సంస్థ మీద దళారీ రాజకీయాలను అభిమానించే నాయకుల ప్రాబల్యం ఎక్కువైంది. కాంగ్రెసు చెప్పే అహింస విదేశీ పాలకులతో రాజీ బేరాలకు దిగడానికి ఒక సాకుగా తయారయింది."

గాంధీ నెహ్రూల నాయకత్వం భగత్‌సింగ్ తదితరులను ఉరిశిక్ష నుండి తప్పించడానికి సీరియస్‌గా ప్రయత్నించకపోవడం వారి దళారీ రాజకీయాల కారణంగానే అన్నది స్పష్టం.

అంతర్జాతీయ నాయకత్వం సూచించినట్టు భగత్‌సింగ్ తదితరులు ఆశించినట్టు జాతీయోద్యమం పైన దళారీ బూర్జువా నాయకత్వాన్ని తప్పించలేక పోయినందువల్లే – సామ్రాజ్యవాదుల దోపిడీకి ముప్పులేనివిధంగా అధికారాన్ని నల్లపాలకులకు బదిలీ చేసి వెళ్ళారు. దానితో బ్రిటిషువాడి గుత్తాధిపత్యం పోయింది. అమెరికా, రష్యాల పోటీకి రంగస్థలమైంది, జర్మనీ, జపాన్ తదితర సామ్రాజ్యవాదుల దోపిడీకి కూడా అవకాశం ఏర్పడింది.

**ధర్మకర్తృత్వమా? దోపిడీ పరిరక్షణాయత్నమా?**

వర్గపోరాటం అనాదిగా వుంది. అది కారల్ మార్క్స్ సృష్టికాదు. గాంధీ అటువంటిదాన్ని గుర్తించనన్నంత మాత్రాన అది లేకుండా పోయేదీ లేదు. వర్గపోరాటమంటే హింసాత్మక పోరాటమేనని, సాయుధ విప్లవమేనని భయంతో గాంధీ వణికిపోయేవాడు. వర్గపోరాటం యొక్క అత్యున్నత రూపమే సాయుధ విప్లవం.

నిజానికి గాంధీ చంపారన్‌లో నీలిమందు రైతులతోనూ, అహమ్మదాబాదు కార్మికులతోనూ చేయించింది వర్గపోరాటమే. తాను కార్మిక కర్షకులకు కూడా నాయకుడననే భ్రమను ప్రజలకు కలిగించడానికీ, తన శాంతియుత పద్ధతులవల్ల దోపిడీ వర్గాలకు దీర్ఘకాలపు ప్రయోజనం వుంటుందనే విశ్వాసం పెంచటానికి మాత్రమే ఈ పోరాటాలు చేయించాడు. వాటిని తన సహజ సంస్కరణవాద ఊబిలోకి దింపి పక్కదారి పట్టించాడు. అయినప్పటికీ కార్మికుల మిలిటెంట్ స్వభావాన్ని గ్రహించి యంగ్ ఇండియా పత్రికలో 16–2–1921న ఇలా రాసుకొన్నాడు.

"చాలామంది అనుకొంటారు – రాజకీయ పోరాటంలో కార్మికులు సమ్మె చేయటం ఉపయోగకరమని! నా ఉద్దేశ్యంలో రాజకీయ సమస్యల పరిష్కార సాధనకు కార్మికులచేత సమ్మె చేయించటం చాలా పెద్ద తప్పు."

కార్మికులను పోరాటాల్లోకి తీసుకురావటానికి బూర్జువా వర్గం ఎందుకు భయపడుతుందో భగత్‌సింగ్ స్పష్టం చేశాడు. (ఇంకా వుంది)

## హిందువులది రామభక్తి ! మోడీ టీమ్‌ది రాజ్యభక్తి ! ఆదానీది అడవి భక్తి !

కట్టుకథల పురాణ రామాయణమంతా పారాయణం చేసే అవసరం లేకుండా కట్టే, కొట్టే, తెచ్చే అన్నారు. రాముడు వారధి కట్టాడు. రావణుణ్ణి చంపాడు. సీతను తెచ్చాడు. *మూడు ముక్కల్లో ఆధునిక రాజకీయ రామాయణం :*

మసీదు కూల్చేన్. గద్దెని ఎక్కెన్. సర్కారు ఏలెన్. అదే కూల్చే, ఎక్కే, ఏలే.

ఇక రేపటి అత్యాధునిక రాజకీయ రామాయణం :

భక్తుల్ని మభ్యపెట్టడానికి రాముడికి గుడి కట్టడం

ఆదానీ బొజ్జ నింపడానికి అడవుల్ని కట్టబెట్టడం!

మోడీ బృందాన్ని ఫాసిస్టు గద్దెపైకి తిరిగి రప్పించడం!

*ఏతా వాతా ఏమంటే...*

భక్తులకు మిగిల్చేది శ్రీరామ నామస్మరణ, చెక్కభజనలు! ఆదానీకి దక్కేది (కట్టుకథలోని కల్పిత) రాముడు తిరిగిన అడవిలోని ట్రిలియన్ల ఖనిజ సంపద, వనరులు!

మోడీ బృందం చేపట్టేది ఫాసిస్టు పీఠం ఎక్కి కొరడా ఝుళిపించే అధికారం.

దండకారణ్యంలో వనవాసం ఓ పురాణ కథనం! రాముడు నడిచిన అడవులు, కొండలతో పాటు రామ పాదధూళి సోకిన నేల పవిత్రమనేది హిందువుల నమ్మకం. వాటిని డైనమైట్లతో పేల్చివేతలు, కూల్చివేతలు, త్రవ్వకాలు, తొలగింపులు అపవిత్రం. అవి అందుకోసమే ఆదానీకి మోడీ సర్కార్ అప్పగిస్తోంది. హిందూమత దృష్టిలో అపవిత్ర కార్యాన్ని ఓ పవిత్రకార్యంగా మార్చేదే గుడి! హిందువుల దృష్టిలో లక్షల కోట్ల "పవిత్ర" స్థలాల్ని ఆదానీకిచ్చి అందులో ఒక శాతం లాభంతో హిందువుల్ని తృప్తి పరిచే గుడి కట్టడం గొప్ప పొలిటికల్ మంత్రముగ్ధ కళ!

ఓవైపు గుడికట్టి హిందువుల్ని పూజలతో బ్రతకండంటూ; మరోవైపు రాముడు తిరిగిన కీకారణ్యాల్ని ఆదానీకి ఇచ్చేసి ఏలుకొమ్మనడం; ఇంకోవైపు తామే తిరిగి గద్దె ఎక్కడం అనే మూడు విధాల వ్యూహ రచనే రేపటి రసవత్తర ఎన్నికల రాజకీయ రామాయణం!

ఒక్కమాటలో – భక్తులకు పూజ్యం, కార్పొరేట్లకి భోజ్యం, ఫాసిస్టులకు రాజ్యం.

నాడు కట్టే, కొట్టే, తెచ్చే, నిన్న కూల్చే, ఎక్కే, ఏలే.

రేపటి ఎన్నికల ఎజెండా, పూజ్యం, భోజ్యం, రాజ్యం.

నేడు హిందువుల నమ్మకాలు దెబ్బతినేది పరమతస్తుల వల్ల కాదు. హిందూ ముసుగుని ధరించిన హిందుత్వ మోడీ సర్కార్ చేసినంత ద్రోహం పర మతాలు సైతం చేయలేవు. ఈ నిజం హిందువులకి వెల్లడి చేయడం ఓ రాజకీయ కళ!

**– ఇప్టూ ప్రసాద్ (పిపి)**

Editor, Printed & Published by : **B. Sudhakar** Printed at MYTRI ART PRINTERS, Mahaboobnagar.